mohan PUBLICATIONS
Granthanidhi.blogspot.in
ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆరోగ్యాది అనేక విషయాలు తెలుసుకోండి... ఫేస్‌బుక్
FB@mohanpublications
మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట, రాజమహేంద్రవరం - 533 101.
Mohanpublications.com
SUNDAY SPECIAL MAGAZINES
గ్రంథనిధి

వార్త
ఆదివారం
12 మార్చి 2017

వలస బతుకులు!

దహిస్తోన్న విద్వేష జ్వాల..

తారాతీరం

మరో సాహసం

నిజంగానే సాహసం.. మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి .. ఆయన పాత్ర కన్పిస్తుందే తప్ప మమ్ముట్టి కన్పించని వైనం తెలిసిందే.. తాజాగా ఆయన తీసుకున్న నిర్ణయం ఒక సంచలనంగా మారింది..ఒక ట్రాన్స్ జెండర్‌తో రొమాన్స్ చేసేందుకు ఒకే చెప్పారు. ఒక అగ్రనటుడి ఇంత సాహసోపేతమైన నిర్ణయం ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ హిస్టరీలోనే లేదు. తన తాజా చిత్రంలో అంజలి అమిర్ అనే యువ నటితో ఆయన జతకట్టనున్నారు. ఇక్కడ అంజలి అమిర్ మోడల్‌గా మారింది. ఆమె కల నిజమై సూపర్ స్టార్ మమ్ముట్టి చిత్రంలో ఆయనకు జతగా నటించే ఆఫర్ చేజిక్కించుకుంది.

సన్నజాజి ఒంపులు

పవన్ పక్కన ఒకే ఒక్క సినిమా అత్తారింటికి దారేదీ లో సెకండ్ హీరోయిన్‌గా చేసిన ప్రణీత సుభాష్.. మెయిన్ హీరోయిన్ సమంతకంటే ఎక్కువ క్రేజ్ సంపాదించుకుది.. టాలీవుడ్ బాపుబొమ్మగా మారిపోయింది.. ఆ తర్వాత కూడ చెప్పుకోదగ్గ స్థాయిలోనే అవకాశాలు వచ్చినా.. ఆ రేంజ్‌ని మాత్రం కొనసాగించటంలో ఒకింత వెనుకబడిందీ భామ. షాపింగ్ మాల్స్, శారీ మాల్స్.. ఈమె వెనక పడుతూనే ఉన్నాయి. అలా ఎందుకు పడుతున్నాయో.. రీసెంట్‌గా అమ్మడు పోస్ట్ చేసిన ఫొటోను చూస్తే అర్ధమవుతుంది. ఆకుపచ్చని పట్టుచీరకు మ్యాచింగ్ జాకెట్ అండ్ ఆర్నమెంట్స్‌తో ప్రణీత లుక్ సూపర్‌గా ఉంది.. ఆమె చీర కట్టిన తీరు చూస్తే మహిళలైనా కుళ్లుకోవాల్సిందే. అచ్చతెలుగింటి మహిళ లుక్‌కు తనను మించివారు మరొకరు లేరన్నట్టుగా మెరిసిపోయింది ప్రణీతా సుభాష్..

త్వరలోనే ఆ కోరిక తీరుతుంది

బాలీవుడ్ సుందరాంగి, బాక్సాఫీసు క్వీన్ కంగనా రనౌత్‌కు దేశవ్యాప్తంగా కోట్లాది అభిమానులు ఉన్న విషయం తెలిసిందే! తెలుగులో ఏక్ నిరంజన్ చిత్రంలో నటించి ఇక్కడ కూడ అభిమానులను సంపాదించుకుందీ బ్యూటీ. తనకున్న సరికొత్త ఆలోచన తాలూకు గుట్టు విప్పింది.. తన గురించి చెబుతూ– తనకు ఎప్పటినుంచో దర్శకురాలు అవ్వాలని చాలా బలమైన కోరిక ఉండేదని, అది త్వరలోనే నెరవేరుతోందని తెలిపింది.. న్యూయార్క్ ఫిలిం అకాడమీ నుంచి ఇప్పటికే స్క్రిప్ట్ రైటర్‌గా ట్రైనింగ్ పొందిన కంగనా.. ఓ బయోపిక్‌ను డైరెక్టు చేస్తానన్నట్టు వెల్లడించింది. ఈ సినిమాకు సంబంధించిన కథను స్వయంగా తానే రూపొందిస్తున్నట్టు వెల్లడించింది.. వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయ్ చరిత్రలో టైటిల్ రోల్‌ను తానే పోషించనున్నట్టు వివరించింది.

కె.సురేష్ బాబు

An ISO 9001 - 2000 Certified ®

The art of healing

పాజిటివ్ హోమియోపతి

www.drpositive.in

పాజిటివ్‌గా ఆలోచించండి.. పాజిటివ్‌తో జీవించండి

మీ జయసుధ

మహిళల ఆరోగ్య సమస్యల కోసం ప్రత్యేకమైన చికిత్స

POSITIVE Hormones

ఇన్‌ఫెర్టిలిటి, థైరాయిడ్, డయాబెటిస్, అధిక బరువు, PCOD & ట్యూబ్స్ బ్లాకెజ్ మొదలైన హార్మోన్ సమస్యలకు

Positive Orthopathy

A Positive Homeopathy Initiative

వెన్ను, కీళ్ళ నొప్పులకు సంపూర్ణ చికిత్స (ఆపరేషన్ లేకుండానే)

- లుంబార్ స్పాండిలైటిస్ • ఆస్ట్రియోఆర్థరైటిస్ • టెన్నిస్ ఎల్బో
- సర్వికల్ స్పాండిలైటిస్ • సయాటికా • రుమాటాయిడ్ ఆర్థరైటిస్
- ఫ్రోజెన్ షోల్డర్ • కాల్షియం డెఫిషియన్సీ • హీల్ పెయిన్

Ph: 903-056-1144

డయాబెటిస్.. హోమియోతో చక్కని పరిష్కారం

- డయాబెటిస్ • ఇన్సులిన్ డయాబెటిస్
- డయాబెటిక్ నెఫ్రోపతి • థైరాయిడ్ • గ్యాస్ట్రిక్ అల్సర్

Ph: 903-056-1155

పైల్స్ తగ్గేదెలా?

మౌనం వీడండి

మా అనుభవజ్ఞులైన ఫ్రెండ్లీ డాక్టర్ల సలహాలతో

పైల్స్, ఫిస్టులా & ఫిషర్ సమస్యలకు పూర్తి చికిత్స (ఆపరేషన్ లేకుండానే)

Ph: 903-056-1188

TOLL FREE: **1800 108 1900**

బేగంపేట | అమీర్‌పేట | జూబ్లీహిల్స్ | కొండాపూర్ | కూకట్‌పల్లి | విక్రమ్‌పురి | A.S.రావు నగర్
కాచిగూడ | దిల్‌సుఖ్‌నగర్ | మెహిదీపట్నం | నిజామాబాద్ | హన్మకొండ | కరీంనగర్ | ఖమ్మం

www.positivehomeo.in

ఆదివారం వార్త
12 మార్చి 2017

మంచి ముత్యాలు

నువ్వు నమ్మినదీ, ప్రేమించినదీ చేసుకుంటూ పోతూండు. విజయం దానంతట అదే సహాయంగా నీ దారిలోకి వస్తుంది.

-డేవిడ్ ఫ్రాస్ట్

విషయ విశేషం

'సంఘీ'భావం
భారత్ అవినీతిరహితమయ్యేదెప్పుడు?... 5
మూడో కన్ను
'కాలుష్యం'లో క్యాపస్‌లు.....6
కవర్‌స్టోరీ
వలస బతుకులు!
దహిస్తోన్న విద్వేష జ్వాల.....8
హాయిగా నవ్వించే హాస్య 'మాణిక్యం'....12
ప్రేమ కథామాలిక
దురాశ ప్రేమకు చేటు..14
ఆనందోత్సవ కేళి....19
కథ
వానప్రస్థం....20
ఈవారం కవిత్వం
స్వప్నం నా ఆకాంక్ష...23

చిత్రభారతి
ఎం.జి.ఆర్.కు వందేళ్లు....30
ఇంకా..కృతి, మొగ్గ,
నవ్వుల్..రువ్వుల్,
వాస్తు వార్త, పదమథనం
..వారఫలం.. వగైరా... వగైరా.

తేనె... (లేఖలు)

గర్వకారణ గ'ఘన' విజయం

ఫిబ్రవరి 26 వార్త ఆదివారం అనుబంధంలో అందించిన కవర్ స్టోరీ గ'ఘన'భారత్!..'తారాపథా'న ఇస్రో..' సవివరంగా ఉంది. ఒకేసారి 104 ఉపగ్రహాలను అంతరిక్షానికి పంపి రికార్డు సృష్టించడం నిజంగా భారతీయులందరికీ గర్వకారణం. సమయోచిత కవరుకథనాన్ని అందించిన మీకు అభినందనలు.

-కె.రాకేష్, హైదరాబాద్; వి.సాయికార్తీక్, వరంగల్; టి.ప్రసాద్, విజయవాడ.

ఆసక్తిదాయక ఆర్టికల్స్..

ఫిబ్రవరి 26 వార్త ఆదివారం అనుబంధంలో 'భావవీచికలో రాజకీయం, అధికారం అడ్డంపెట్టుకొని చట్టాల ఉల్లంఘనకు పాల్పడే ప్రజాప్రతినిధులపై కఠినచర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను చక్కగా చెప్పారు. వాయుకాలుష్యానికి తక్షణం అడ్డుకట్ట వేయకపోతే మానవాళికి భవిష్యత్తులో ఎంతటి పెనుముప్పో సంఘీభావం వివరించిన తీరు ఆకట్టుకుంది. 'నిచ్చెనలు, పాములు' కథ ఇతివృత్తం వాస్తవిక దృక్పథానికి దగ్గరగా ఉంది. కవర్ స్టోరీగా అందించిన ఇస్రో విజయగాథ ఎంతో స్ఫూర్తిదాయకం.

-ఎం.కనకదుర్గ, తెనాలి.

అలరించిన ఆదివారం సంచిక..

ఫిబ్రవరి 26 వార్త ఆదివారం అనుబంధంలో 'భావవీచికలో నేటి నేతల ప్రవర్తన గురించి చెప్పిన విషయాలన్నీ అక్షరసత్యాలు. ప్రపంచంలో అత్యంత కలుషితంగా మారిన రెండు నగరాలూ మనదేశంలోనే ఉన్నాయని 'సంఘీ'భావం ద్వారా తెలుసుకున్నాం. ఇకనైనా అంతా మేల్కొనాలి. 'మూడోకన్ను' వాస్తవికంగా ఉంది. కోర్టు నివేదిక ప్రకారం 'అమ్మ' దోషురాలైతే, అమ్మ భక్తులంతా నిర్దోషులవుతారా..అన్నది అందిరినీ తరుముతున్న మీమాంస. కవితలన్నీ భావగర్భితంగా రూపుదిద్దుకున్నాయి. బ్యాక్‌కవర్‌పైని అకషిగ పార్క్ ..విస్టీరియా పూల సోయగాలు ఎంతో ఆహ్లాదకరంగా ఉండి ఆకట్టుకున్నాయి.

- నేమాన సుభాష్‌చంద్రబోస్, విశాఖపట్టణం.

కథలో పాత్రచిత్రణ బాగుంది..

ఫిబ్రవరి 26 వార్త ఆదివారం అనుబంధంలో 'నిచ్చెనలు, పాములు' కథ బాగుంది. శివయ్య పాత్ర చిత్రణ చక్కగా ఉంది. నిచ్చెనగా తోడ్పడిన శివయ్య, పాముగా మారటం.. పాపం రమేష్.. మంచికథనందించిన రచయితకు అభినందనలు. -ఆర్.సృజన, హైదరాబాద్.

భావ వీచిక

చైతన్యమే చిరునామాగా..

సాధారణంగా పుట్టి, పెరిగే పరిస్థితులే ఆ వ్యక్తికి వ్యక్తిత్వాన్ని సమకూర్చి, అభివృద్ధికి కీలకమవుతాయంటారు. అది కొంతవరకు నిజం. అయితే చిత్తశుద్ధి ఉంటే అట్టడుగు స్థానం నుంచి కూడా అత్యున్నత స్థాయికి చేరవచ్చన్నది కూడా నిజమే. ఇలాంటివి సినిమాకథలే అనుకుంటారు కానీ వాస్తవంలోనూ ఇలాంటివారెందరో ఉన్నారు. మచ్చుకు కోల్‌కతాలోని టుక్‌టుకి మొండాల్ అనే ఓ చెత్త ఏరుకునే అమ్మాయి పట్టణ పేదరికంపై జరిగే పరిశోధనలో సహాయకురాలి స్థాయికి ఎదిగింది. తండ్రిని కోల్పోయి, తల్లికి దూరంగా, నెలలవయసు నుంచే అమ్మమ్మ దగ్గర పెరిగింది. ఆమె పట్టుదలతోనే చదువుకొనసాగించింది. నగరంలో మరోమూల చెత్త ఏరుతూ, బళ్లో తన కుటుంబపరిస్థితి ఎవరికీ చెప్పకుండానే చదువుకున్నది టుక్‌టుకీ. కొన్నిసార్లు చదువు కొనసాగదేమో అన్న పరిస్థితులు. అయినా పరిస్థితులనెదిరించి స్కూలు చదువేశాడు, 2012లో కాలేజీ చదువు కూడా పూర్తిచేసి ఆ ప్రాంతంలోని చెత్త ఏరుకునే వారిలో తొలి గ్రాడ్యుయేట్‌గా రికార్డు సాధించింది. మహానిర్బన్ కోల్‌కతా రీసెర్చ్ గ్రూప్ (ఎమ్‌సిఆర్‌జి) వారి దృష్టి నాకర్షించింది. 'అర్బన్ మైగ్రేషన్ అండ్ పావర్టీ ఇన్ 2016' నివేదికకు కావలసిన సమాచారాన్ని అందించింది. ఇళ్లులేనివారికి ప్రభుత్వ గుర్తింపు డాక్యుమెంట్లను సాధించ డానికి ఆమె ఎంతగానో కృషి చేస్తోంది. చాలామంది తాము అభివృద్ధిలోకి రాగానే అంతవరకు ఉన్న తమ ఇరుగుపొరుగును మరచిపోతుంటారు. కానీ టుక్‌టుకీ అలా కాదు. తనలాంటివారికి సాయపడాలన్నది ఆమె కోరిక. దక్షిణ కోల్‌కతాలోని ఓ పేవ్‌మెంట్‌పై ఏర్పాటు చేసుకున్న బడ్డీలోనే వారి జీవనం. ఆ పక్కనే భర్త మొండాల్ టీ షాప్ నడుపుతున్నాడు. ప్రస్తుతం తన రెండేళ్ల పాపను శ్రద్ధగా పెంచుతోంది టుక్‌టుకీ. తన కుమార్తెను తనకన్నా ఎక్కువ ఆత్మవిశ్వాసంతో ఉండేలా తీర్చిదిద్ద తానంటుందామె. ఎంతో మెరుగైన పరిస్థితులలో ఉండి కూడా చిన్నచిన్న కష్టాలకే కుంగిపోతూ నిరాశలో కొట్టుమిట్టాడుతుంటారు. అలాంటి వారికి చైతన్యమే చిరునామాగా నిలిచిన టుక్‌టుకీ నిజంగా ఓ గొప్పస్ఫూర్తి!

‘సంఘీ’భావం

భారత్ అవినీతిరహితమయ్యేదెప్పుడు?

దేశ సర్వతోముఖాభివృద్ధికి అవినీతే ప్రధాన అడ్డంకి అని అంతా చెప్తూనే ఉన్నారు. పార్టీలకతీతంగా అందరూ అవినీతి విముక్త దేశంగా భారత్ మారేదెప్పుడని కోరుతూనే ఉన్నారు. భారత్‌కన్నా చిన్న దేశాలు అవినీతిని పూర్తిగా నిర్మూలించి అభివృద్ధిలో, పేదరిక నిర్మూలనలో ముందంజలో ఉంటే మన దేశం మాత్రం ఇంకా అవినీతి విషయంలో అగ్రగామిగానే ఉంటున్నది. ఇది మరోసారి ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ నివేదికలో వెల్లడైంది. అవినీతికి వ్యతిరేకంగా అధ్యయనాలు నిర్వహించే ఈ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరుంది. ఈ సంస్థ ఇటీవల ఆసియా పసిఫిక్‌లోని 16 దేశాల్లో 30,000 మంది వివిధ వర్గాల ప్రజలను కలిసి, అవినీతిపై వారి అభిప్రాయాలను సేకరించి గడిచిన వారమే జర్మనీలోని బెర్లిన్‌లో సమగ్ర నివేదికను విడుదల చేసింది. ఈ నివేదికలో బయట పడిన అంశాలు దేశంలో అవినీతి విశ్వరూపాన్ని మరోసారి బట్టబయలు చేశాయి. 16 దేశాల్లో అధ్యయనం నిర్వహిస్తే భారతదేశంలోనే అత్యధికంగా అవినీతి ఉందని సంస్థ అధ్యయనంలో వెల్లడైంది.

పాకిస్థాన్, చైనా దేశాల్లోకన్నా భారతదేశంలోనే అవినీతి అత్యధికంగా ఉందని ఈ నివేదిక ప్రకటించడం నిజంగా ఇది మన ప్రతిష్ఠకు మచ్చే. “పీపుల్ అండ్ కరప్షన్ ఏసియా పసిఫిక్” పేరిట ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ 16 దేశాల్లో అధ్యయనం నిర్వహించగా జపాన్, దక్షిణ కొరియాలో అవినీతి అత్యల్పంగా ఉంది. భారతదేశంలో అవినీతి బాధితులు 69 శాతమైతే రెండో స్థానంలో ఉన్న వియత్నాంలో 65 శాతం, పాకిస్థాన్‌లో 40 శాతం, చైనాలో 26 శాతం ప్రజలు అవినీతి బాధితులుగా తేలారు. జపాన్‌లో అవినీతితో 0.2, దక్షిణ కొరియాలో 3 శాతం ప్రజలే ఇబ్బంది పడుతున్నారంటే అక్కడ పరిపాలన ఎంత పారదర్శకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రజలు దైనందిన జీవితంలో ఉపయోగపడే సేవల్లో వివిధ శాఖల్లో పనులకోసం భారతదేశంలో 69 శాతం మంది లంచాలు చెల్లించామని ఒప్పుకున్నారు. లంచాలు ఇవ్వందే పని కాదని వారు తేల్చి చెప్పారు. ముఖ్యంగా పోలీసుశాఖలో 85శాతం పాలకవర్గంలో భాగమైన ఎం.పి.ల్లో 76 శాతం, న్యాయశాఖలో 66 శాతం, ప్రజారోగ్య శాఖలో 59 శాతం, విద్యాశాఖలో 58 శాతం అవినీతి ఉందని వివిధ వర్గాల ప్రజలు పేర్కొన్నారు. కానీ అవినీతితో ఎక్కువగా బాధపడుతున్నది పేద ప్రజలేనని, దీనివల్ల వారి జీవన ప్రమాణం మరింతగా దిగజారుతుందని ఆ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. అంటే భారతదేశంలో ప్రతి పదిమందిలో ఒకరు లంచావతారాలకు లంచాలు ఇచ్చి పనులు చేయించుకుంటున్నారు. ఈ చేదు నిజం వెల్లడి కావడం మొదటిసారి కాదు. చివరిసారి కూడా కాదు. కానీ అవినీతికి మూలమైన రాజకీయ, బ్యూరోక్రసీ అవినీతిని నిర్మూలించడంలో పార్టీలేవైనా మాటలు తప్ప చేతలకు ముందుకు రాకపోవడమే అవినీతి విశ్వరూపం దాల్చడానికి కారణమని చెప్పక తప్పదు.

పుట్టినప్పటినుంచి చనిపోయేదాకా ప్రతి ధృవీకరణకు, ప్రభుత్వం అందించే ప్రతి సేవకు అదనంగా లంచాలు ఇవ్వాల్సిందే. ప్రభుత్వ ఉద్యోగులుగా, అధికారులుగా వేతనాలు పొందుతున్నవారు ప్రజల డబ్బుతో చట్టసభల్లో ప్రజా ప్రతినిధులుగా కొనసాగుతున్నవారి అవినీతే ఎక్కువగా ఉంటున్నది. ప్రజా జీవితంలో పారదర్శకత కరువు కావడం, రాజకీయ బ్యూరోక్రాట్ల అవినీతిని తుద ముట్టించే నిఘా, నియంత్రణ వ్యవస్థను సమర్థవంతంగా పని చేయకుండా నీరుగార్చడమే అవినీతికి అసలు కారణాలుగా చెప్పవచ్చు. ప్రజల డబ్బుతో అధికారులు, ఉద్యోగులు ప్రయివేటు వ్యవస్థలు అక్రమ మార్గాల్లో సంపాదనను ఆర్జించడంతోనే అవినీతి వెయ్యి ముఖాలుగా విస్తరిస్తూ వస్తున్నది. చివరకు న్యాయశాఖలో కూడా అవినీతి ఆందోళనకరంగా విస్తరిస్తున్నదని సంస్థ పేర్కొనడం ప్రజల్లో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ నివేదిక విడుదల అయిన తరువాతనైనా మన పాలకులు మేల్కొంటే దేశానికి మేలు జరుగుతుంది. లేదా అవినీతే పెనుశాపమై భారత్ అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా మారుతుంది.

అవినీతిని నియంత్రించడానికి మార్గాలు లేకపోలేదు. కానీ అవినీతిలో తిలా పాపం తలా పిడికెడు కావడం అన్ని వ్యవస్థలు అవినీతి మడుగులో కూరుకుపోవడంతోనే ఎవరూ బయటికి రాలేకపోతున్నారు. ఎవరినీ అవినీతి కూపం నుంచి బయటికి తీయలేకపోతున్నారు. నిజానికి అవినీతి ఒక కుటుంబానికో, ఒక వర్గానికో పరిమితమైనది కాదు. ఇది సకల వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నది. సకల విలువలను నాశనం చేస్తున్నది. అవినీతిని నియంత్రించే సిబిఐ, ఎసిబి, సిబిసిఐడి, నిఘా విభాగాలు లాంటి వ్యవస్థలు అనేకం ఉన్నాయి. వారికి పెద్ద ఎత్తున ప్రజాధనమే వేతనాలు అలవెన్సుల రూపంలో అందుతున్నది. కానీ ఈ వ్యవస్థలకు స్వేచ్ఛ లేదు. స్వతంత్రంగా పని చేయాల్సిన ఈ వ్యవస్థలను రాజకీయ నాయకత్వమే నీరు గారుస్తున్నది. సకల అవినీతులకు కేరాఫ్‌గా ఉన్న రాజకీయ అవినీతిని ఎవరూ అడ్డుకునే సాహసం చేయలేకపోతున్నారు. వారే పాలకులు కావడం చట్టాలను రూపొందించడం చివరకు వారే ఉల్లంఘించడంతో సాధారణ ప్రజానీకం కూడా వారి బాటలోనే పయనిస్తూ విలువలకు సెలవులిస్తున్నారు. ఫలితంగా భారత్ అవినీతి విషయంలో చెడ్డ పేరు తెచ్చుకుంటున్నది.

జపాన్‌లా, దక్షిణ కొరియాలా అవినీతి కనీస స్థాయికి దిగిరావాలంటే కఠిన చర్యలు తప్పవు. లంచం అడిగితే, లంచం ఇస్తే అది తీవ్ర నేరమని దానికి నిర్దిష్ట కాలవ్యవధిలో శిక్షలు విధించే న్యాయ వ్యవస్థను అమల్లోకి తీసుకువస్తే తప్ప అవినీతికి అడ్డుకట్ట పడే అవకాశం కనిపించడం లేదు.

గతంలో అవినీతిని ఎదురించే అంకుశాలను హీరోలుగా చూపిస్తూ ఠాకూర్, భారతీయుడు లాంటి సినిమాలు ఎందుకు విజయవంతమయ్యాయంటే ప్రజల్లో అంతగా అసహనం, అసంతృప్తి ఉన్నాయని అవి చాటిచెప్పాయి. అవినీతిని అంతమొందించడం రాజకీయ అవినీతికి అడ్డుకట్ట వేయడంతోనే ప్రారంభం కావాలి. అది చివరకు సాధారణ ప్రజానీకందాకా చేరాలి. అపుడే అవినీతి విముక్తంగా దేశం మారే అవకాశం ఉంటుంది. అయితే ఇది సాధ్యమా అనే ప్రశ్న ఎదురు కావొచ్చు. దీనికెవరు శ్రీకారం చుడతారు? అనే సందేహం రావొచ్చు. ఏ మార్పయినా చిన్న సంస్కరణతోనే ప్రారంభమై పెను మార్పులకు దారి తీయడం మనకు అనుభవాలే. ఆ దిశగా అంతా కదిలితేనే అవినీతికి చరమగీతం పాడవచ్చు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

మూడో కన్ను

– ఎ.వి.వి. ప్రసాద్

'కాలుష్యం'లో క్యాంపస్‌లు

రాజకీయ చిచ్చు రగిలించునొక్కడు,
విషపు వృక్షములను పెంచునొకడు;
కలచి వేయుచుండె కాలేజి క్యాంపస్‌లు
విశ్వవినుత నామ! వినురవేమ!!

హింస, అసహనం, విద్వేషం... ఈ మూడు లక్షణాలకు విద్యార్థులను ప్రతీకలుగా నిలపాలనుకొనే రాజకీయ నాయకులున్నంత కాలం కళాశాలలు, వర్సిటీల క్యాంపస్‌లలో అశాంతి చెలరేగుతూనే ఉంటుందని రోహిత్, కన్హయ్య, గుర్‌మెహార్ ఉదంతాలు నిరూపిస్తున్నా దానికి పరిష్కారమేమిటి? అని ఆలోచించేవారే లేకపోవడం బాధాకరమైన మరో అంశం. అందరూ మంటలను ఎగదోసేవారే. తమకు సంబంధం లేకపోయినా, సోషల్ మీడియాలో యధేచ్ఛగా వ్యాఖ్యలు చేస్తూ సమస్యను మరింత జటిలంచేసేవారే ఎక్కువవుతున్నారు. దీనివల్లనే చిన్న చిన్న సమస్యలు కూడా పెనుభూతాల్లా మారి కొత్త సమస్యలను, ఉద్రిక్తతలను సృష్టిస్తున్నాయి.

అభివృద్ధి సాధకమైన చర్చలకు, అర్థవంతమైన ఆలోచనలకు కేంద్రాలు కావలసిన విద్యాలయాలు రానురాను ఇతరుల భావ స్వేచ్ఛకు భంగం కలిగించే విద్వేష నిలయాలుగా మారిపోతున్నాయా? దేశంలోని విద్యాలయాలలో నెలకొని ఉన్న 'సంక్షోభ వాతావరణం' చూస్తే ఇదే సందేహం కలుగుతుంది. ఆందోళనలు ప్రేరేపించే ప్రచారాల పట్ల చూపించే శ్రద్ధ దేశ అభ్యున్నతికి దోహదంచేసే పరిశోధనలపై కనిపించడం లేదనే అభిప్రాయంలో సందేహం లేదనిపిస్తుంది. కొన్ని పార్టీలు, కొందరు నాయకుల జోక్యం పెరిగిపోయి వారి భావజాలమే విద్యార్థుల ఆలోచనల్నట్లుగా చిత్రీకరించడం చూస్తే మొత్తం విద్యావ్యవస్థకు చెదలు ఎంతగా పడుతున్నాయో అర్థమవుతుంది. విద్యార్థుల్లోను, విద్యాలయాల క్యాంపస్‌లలోను ఏదో తెలియని అభద్రతా వాతావరణం తాండవిస్తోంది. అశాంతి అణువణువునా విస్తరిస్తోంది. పోలీసుదళాలు తరచుగా వర్సిటీల క్యాంపస్‌లలోకి రావలసిన అగత్యం ఏర్పడుతోంది. ఎవరి భావ స్వేచ్ఛ వారికి ఉండవలసిందే. కానీ అదేసమయంలో ఇతరుల భావస్వేచ్ఛకు ఎవరూ అవరోధం కలిగించరాదనే సత్యం అందరికీ అర్థం కావలసి ఉంది. దానిని వదలివేయడం వల్లే విద్యాలయాల క్యాంపస్‌లు అంతటి అశాంతిలో కూరుకు పోతున్నాయనిపిస్తుంది.

రోహిత్..కన్హయ్య..ఉమర్ ఖలీద్.. తాజాగా గుర్‌మెహార్ కౌర్ వంటి ఎందరో విద్యార్థినీ విద్యార్థులు విద్యాలయాల్లోని 'అశాంతి'నుంచి వార్తల్లోకి వచ్చినవారే. వారిచుట్టూ ఎన్నో ఆందోళనలు.. కథలు, కథనాలు, విద్యార్థులు వార్తల్లోకి వచ్చిన ప్రతిసారి నేతలు వారి చుట్టూ మూగిపోవడం, వాతావరణాన్ని మరింత ఉద్రిక్తం చేయడం, దానికి రాజకీయ రంగు పులమడం, తమ పబ్బం గడుపుకొని పక్కకు తప్పుకోవడం, మామూలయిపోతోంది. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో రోహిత్ అనే పరిశోధక విద్యార్థి ఏడాదిక్రితం ఆత్మహత్య చేసుకొని సంచలనం సృష్టించినపుడు జాతీయస్థాయి నాయకులంతా వర్సిటీ క్యాంపస్‌లోకి వాలిపోయారు. క్యూలు కట్టి మరీ కన్నీరు కార్చారు. కానీ ఆ విద్యార్థి ఏ పరిస్థితిలో అలా ఆత్మహత్య చేసుకోవలసి వచ్చిందో ఆ పరిస్థితులలో మాత్రం ఎలాంటి మార్పు తీసుకురాలేకపోయారు. జెఎన్‌యు విద్యార్థి కన్హయ్య ఉదంతం అలాంటిదే. దేశంలోని మేధావి వర్గానికి, రాజకీయ అధినేతలకు అతడు వేసిన ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానాలు దొరకవు. గళమెత్తిన ప్రతి విద్యార్థిని ఉగ్రవాదుల సానుభూతిపరుడిగా ముద్రవేయడం ఒక అలవాటుగా మారిపోవడంతో అసలు సమస్య పక్కదారి పట్టి అశాంతి ఒక మహమ్మారిలా విజృంభిస్తోంది. అందుకే ఇప్పుడు మరో విద్యార్థిని గుర్ మెహార్ కౌర్ 'అశాంతి స్వరం' అంతగా వినిపిస్తోంది.

వారంతా జాతివ్యతిరేకులు కాదు. దేశ వ్యతిరేకులు అంతకన్నా కాదు. కానీ కొన్ని రాజకీయ పక్షాలు విద్యార్థుల సమస్యలను స్వప్రయోజనాలకు వాడుకోవడంవల్లనే విద్యాలయాలు విద్వేష నిలయాలుగా మారిపోతున్నాయనిపిస్తుంది.

అందరిలాగే వారూ చదువుకోవడానికే, తమ భవిష్యత్తును సుందరనందనంగా నిర్మించుకొనడానికే విద్యాలయాలలోకి ప్రవేశిస్తున్నారు. అయితే అక్కడ అప్పటికే తిష్ట వేసి ఉన్న అదృశ్య రాజకీయ శక్తులు ఆ విద్యార్థుల మనోభావాలను ప్రభావితం చేసి వారిని తప్పుదారి పట్టిస్తూంటాయి. కన్హయ్యపై దేశ ద్రోహ నేరం మోపడానికి ఎన్ని రాజకీయ శక్తులు ఎంతగా ప్రయత్నిస్తున్నాయో సంవత్సర కాలం నుంచి చూస్తూనే ఉన్నాం. కానీ అతడు వెళ్లిన ప్రతిచోటా ప్రజలు బ్రహ్మరథం పట్టడంతో అణచివేయడానికి ప్రయత్నించిన శక్తులే అతడివల్ల రాజకీయ లబ్ధి పొందడానికి కూడా ప్రయత్నించాయి. ప్రస్తుతం గుర్‌మెహార్ కౌర్ విషయంలో కూడా ఆ రెండు పార్శ్వాలే కనిపించడం గమనించవలసిన అంశం.

హింస, అసహనం, విద్వేషం... ఈ మూడు లక్షణాలకు విద్యార్థులను ప్రతీకలుగా నిలపాలనుకొనే రాజకీయ నాయకులున్నంత కాలం కళాశాలలు, వర్సిటీల క్యాంపస్‌లలో అశాంతి చెలరేగుతూనే ఉంటుందని రోహిత్, కన్హయ్య, గుర్ మెహార్ ఉదంతాలు నిరూపిస్తున్నా దానికి పరిష్కారమేమిటి? అని ఆలోచించేవారే లేకపోవడం బాధాకరమైన మరో అంశం. అందరూ మంటలను ఎగదోసేవారే. తమకు సంబంధం లేకపోయినా, సోషల్ మీడియాలో యధేచ్ఛగా వ్యాఖ్యలు చేస్తూ సమస్యను మరింత జటిలం చేసేవారే ఎక్కువవుతున్నారు. దీనివల్లనే చిన్న చిన్న సమస్యలు కూడా పెనుభూతాల్లా మారి కొత్త సమస్యలను, ఉద్రిక్తతలను సృష్టిస్తున్నాయి. ఓ పది మంది విద్యార్థులు ఒక చోట కూర్చొని ఓ అంశంపై చర్చించుకొంటున్నపుడు వారిని అలా వదిలేస్తే అది ఎలాంటి విషయమైనా అక్కడితోనే ముగుస్తుంది. కానీ ఏదో సరిహద్దు యుద్ధం జరుగుతున్నట్లు ఆ రాజకీయ పార్టీలు ఆ విద్యార్థుల చర్చల్లోకి ప్రవేశించేసి అనవసర రాద్ధాంతం చేయడంవల్లే విద్యార్థుల భవిష్యత్తు

నాశనమవుతోంది. ఒకరి భావ స్వేచ్ఛను హరించే 'ప్రత్యేక హక్కు' రాజకీయ పార్టీలకు అసలు ఎవరిచ్చారు? అడిగేవారు లేకనే కదా! ఆ పార్టీలు అలా రెచ్చిపోవడం, విద్యార్థులను రెచ్చగొట్టడం!

****

ఢిల్లీలోని రామ్‌జాస్ కళాశాలలో జరిగిన ఒక ఉదంతాన్ని దేశ వ్యాప్త చర్చకు మళ్లించిన ఘనత ప్రధానంగా రాజకీయ పార్టీలదే అని చెప్పాలి. వామపక్ష విద్యార్థి సంఘం 'ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్' ఇటీవల ఆ కళాశాలలో 'నిరసన సంస్కృతి' అనే అంశంపై ఒక సదస్సును ఏర్పాటు చేసి, దానికి జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీ (జెఎన్‌యు) విద్యార్థి నాయకుడు ఉమర్ ఖలీద్‌ను వక్తగా ఆహ్వానించింది. అతడు ఇప్పటికే కొన్ని వివాదాలలో చిక్కుకొన్ని ఉన్నాడు. గత సంవత్సరం జెఎన్‌యులోనే తీవ్ర సంచలనానికి దారి తీసిన వామపక్ష విద్యార్థుల సభ వివాదంలో 'దేశ ద్రోహ' నేరం ఎదుర్కొంటున్న ఉమర్‌ఖలీద్‌ను రామ్‌జాస్ కళాశాలలోని సదస్సుకు ఆహ్వానించడంతో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టింది. ఆ కారణంగా ఆ సదస్సు రద్దయింది కానీ అది మరో వివాదానికి, మరిన్ని ఆందోళనలకు దారి తీసింది. ఎబివిపి చర్యకు నిరసనగా వామపక్ష విద్యార్థి సంఘాలు ఢిల్లీ వర్సిటీలో పెద్దఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించాయి. యథాప్రకారం పోలీసులు రంగప్రవేశం చేయడంతో ఇరువర్గాల మధ్య భారీగానే ఘర్షణలు చెలరేగాయి. దానితో అది దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి మరో విద్యార్థి వివాదంగా మారిపోయింది. ఈ వివాదం నడుస్తుండగా గుర్‌మెహర్ కౌర్ అనే లేడీ శ్రీరామ్ కాలేజి విద్యార్థిని సోషల్ మీడియాలో వ్యక్తం చేసిన స్పందనలు కొత్త వివాదం సృష్టించడంతో అది మొత్తం విద్యార్థి లోకంలోనే అశాంతికి బాటలు వేసింది.

తాను ఎబివిపికి భయపడబోనంటూ ఒక ప్లకార్డును పట్టుకొన్న తన చిత్రాన్ని ఇటీవల ఫేస్‌బుక్‌లో పోస్టు చేసినందుకుగాను అనేక రకాల బెదరింపులు వస్తున్నాయనీ, సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేయడం ఆపకపోతే రేప్ చేస్తామంటూ కొందరు తనను హెచ్చరిస్తున్నారనీ గుర్ మెహర్ పేర్కొనడంతో ఉమర్ ఖలీద్ వివాదాన్ని ఆమె వ్యాఖ్యల వివాదం మించిపోయి మొత్తం ఉదంతం మరోదారి పట్టింది. ఆమె అలాంటి ప్రకటనలు చేయగానే సహజంగానే అత్యుత్సాహం కనబరిచే ఎలక్ట్రానిక్ మీడియా ఆమెచేత మరికొన్ని ప్రకటనలు చేయించి వివాదాన్ని మరింత జటిలం చేసింది. నిజానికి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించవలసినంత 'చిచ్చు' ఏదీ లేకపోయినా విద్యార్థిసంఘాలు, రాజకీయ పార్టీలు వంతులు వేసుకొన్నట్లు సంక్షోభాన్ని సృష్టించాయి. విద్యార్థులు రెండు మూడు వర్గాలుగా విడిపోయి అనవసర అసహన చర్చలతో కాలక్షేపం చేస్తూ అత్యంత విలువైన అధ్యయన కాలాన్ని వృధా చేసుకొంటుంటే రాజకీయ పార్టీలు వినోదం తిలకిస్తున్నాయి. ఇంతటి అశాంతి వాతావరణానికి అసలు కారణం ఎవరు? నిస్సందేహంగా రాజకీయనేతలే. వారు రెచ్చగొట్టకపోతే ఏ విద్యార్థి తన విలువైన చదువుకునే కాలాన్ని వృధా చేసుకొంటాడు?

క్యాంపస్‌లలో ఉద్రిక్తతలకు కారణమవుతున్నదెవరో విద్యార్థులు తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని రామ్‌జాస్ కళాశాల ఉదంతం స్పష్టంగా చెబుతోంది. రాజకీయ నాయకులు రెచ్చగొట్టినా నిగ్రహంతో మెలగవలసిన బాధ్యత విద్యార్థులపై కూడా ఉంది. ప్రశ్నించే తత్వం, అవసరమైతే ఎదురుతిరిగే లక్షణం విద్యార్థులలో ఉండరాదని ఎవరూ అనలేరు. కానీ సోషల్ మీడియాలో చేసే వ్యాఖ్యలకు ఎలాంటి ప్రతిస్పందన ఉంటుందో తెలిసిందే గనుక వాటి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవడం కూడా ఎంతో అవసరం. లేకుంటే ఒక చిన్న వ్యాఖ్య దేశమంతా మహా సమరానికి దారి తీసే ప్రమాదం కూడా తలెత్తుతూంటుంది. గుర్ మెహర్ స్పందనపట్ల అభ్యంతరం ఎవరికీ ఉండదు. కానీ ఆమె తనను ఎవరో రేప్ చేస్తానంటూ బెదిరిస్తున్నారనే సంచలనాత్మక ప్రకటన చేయడంతో అది దేశవ్యాప్తంగా మరిన్ని ఉద్రిక్తతలకు కారణమవుతోందన్నది వాస్తవం.

రామ్‌జాస్ కాలేజి రణరంగంలా మారడం, ఎబివిపి జరిపిన దాడులలో కొందరు ప్రొఫెసర్లు సైతం తీవ్రంగా గాయపడినట్లు వార్తలు రావడం ఒక వంక ఉద్రిక్తతను సృష్టించగా, అగ్నిలో ఆజ్యం పోసినట్లు గుర్ మెహర్ కౌర్ రణరంగ ప్రవేశం చేసి సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేయడంతో అది మరిన్ని ఉద్రిక్తతలకు కారణమవుతోంది.

గుర్ మెహర్ కౌర్ కార్గిల్ యుద్ధంలో మరణించిన కెప్టెన్ మణిదీప్ సింగ్ కుమార్తె. న్యూఢిల్లీలోని శ్రీరామ్ కాలేజిలో ఇంగ్లీషులో ఆనర్స్ కోర్స్ చదువుతోంది. తన తండ్రి ఆ యుద్ధంలో మరణించడంపై గతంలో ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలు కూడా ఇలాగే వివాదాస్పదమయ్యాయి. "పాకిస్థాన్ మా నాన్నని చంపలేదు... యుద్ధం చంపింది" అంటూ గతంలో ఆమె చేసిన ఒక ట్వీట్ ఇలాగే చాలా సంచలనం సృష్టించింది. దానిపై కేంద్ర హోంశాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ "ఈ అమ్మాయి బుర్రను పాడుచేస్తున్నదెవరు? బలమైన సైనిక సంపత్తి ఉంటేనే యుద్ధం కాదు. భారత్ ఎప్పుడూ ఇతరులపై దాడి చేయలేదు. కానీ బలహీనంగా ఉన్నప్పుడల్లా భారత్‌పై దండయాత్రలు జరిగాయి" అని తనదైన ధోరణిలో ట్వీట్ చేశారు. ఒక కెప్టెన్... అందులోను వీరమరణం పొందిన యోధుని కుమార్తెగా కౌర్ తన అభిప్రాయం చెప్పి ఉండవచ్చు. అంతమాత్రంచేత ఆమె అభిప్రాయానికి వెంటనే స్పందించి వివాదం చేయవలసిన అవసరం కేంద్రమంత్రికి ఏముంది! కొంతకాలంక్రితం ఆమె పెట్టిన పోస్టును వెలికి తీసి, దానికి వక్రభాష్యం చెబుతూ ఆమె వెనుక ఎవరో ఉన్నారనే అనుమానం కలిగించే ప్రయత్నం చేయడం ఓ కేంద్ర మంత్రికి అవసరమా! ఇలాంటివన్నీ వివాదాలు సృష్టించడానికి, వాటిని రెచ్చగొట్టడానికి, తద్వారా వర్సిటీ క్యాంపస్‌లలో అశాంతిని పెంచడానికి పనికివస్తాయే తప్ప విద్యార్థులకుగాని, ఆయా పార్టీలకుగాని ఎలాంటి ప్రయోజనం చేకూర్చవు. అటువంటప్పుడు సోషల్ మీడియా ఉన్నది కదా అని ఎందుకు నిప్పు రగల్చడం! ఇటు విద్యార్థులూ ఆలోచించాలి... అటు నాయకులూ ఆలోచించుకోవాలి.

విద్వేషం, అసహనం ఎవరికీ, ఏ స్థాయిలోనూ మంచిది కాదు. ముఖ్యంగా తమకు అందమైన భవిష్యత్తును, దేశానికి అవసరమైన అభ్యున్నతిని సాధించుకోగల విద్యార్థులకు అసలు మంచిది కాదు. వారి ఆలోచనల్లోకి, వారి లక్ష్యాల్లోకి రాజకీయ నేతలు చొరబడకుండా ఉంటే, విద్యార్థి సంఘాలను రాజకీయ పార్టీలు తమ గుప్పెట్లోకి తీసుకొనకుండా ఉంటే ఎలాంటి సమస్య, ఏ విధమైన ఉద్రిక్తత ఉత్పన్నం కానే కావు.

గుర్‌మెహర్ కౌర్ వంటి ఉన్నత విద్యావంతులు తాము ఏ అంశంపైనైనా ట్వీట్ చేసేముందు దాని ప్రభావం ఎలా ఉంటుందన్నది కూడా ఆలోచించాలి. ఏదో ఉపద్రవం వచ్చేస్తున్నట్లు రాజకీయపార్టీల అనుబంధ సంస్థలు ర్యాలీలు, ఆందోళనలు చేపట్టడం, ఈలోగా అసలు సమస్య పక్కదారి పట్టి కొత్త వివాదం తలెత్తడం, అది మళ్లీ ఆందోళనలకు దారి తీయడం... ఇది కాదు కదా! ఒక మంచి సమాజం ఆవిర్భవించడానికి దోహదం చేసేది! విద్యావ్యవస్థను ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉంచవలసిన బాధ్యత పూర్తిగా రాజకీయ నాయకులదే. వారు జోక్యం చేసుకోనంతవరకు అన్ని క్యాంపస్‌లు ప్రశాంతగానే ఉంటాయి. ఎక్కడైనా ఏదైనా అలజడి రేగితే దానికి విద్యార్థులను మాత్రమే బాధ్యులను చేయడం సబబు కాదని రాజకీయ నేతలంతా గ్రహించవలసి ఉంది. విద్యార్థుల చర్చను నేతలు రచ్చచేయకపోతే వారు అసలు వార్తల్లోకే రారు. గుర్ మెహర్ ఉదంతం క్రమంగా వెనక్కి వెళ్లిపోవచ్చు. అలాంటిది మరొకటి ముందుకు రాకుండా ఉండాలంటే పార్టీలు, వాటి నేతలే సంయమనంతో వ్యవహరించించవలసి ఉంటుంది. ■

వలస బతుకులు!

దహిస్తోన్న విద్వేష జ్వాల..

కవర్‌స్టోరీ

గన్ని మోహన్
సీనియర్ రిపోర్టర్, స్టేట్‌బ్యూరో.

వలస! బతుకు తెరువుకో, మరే ఇతర కారణాల వల్లనో మనుషులు అనుకూల ప్రాంతాలకు తరలి వెళ్లడం ఏనాటినుంచో వస్తున్నదే. గ్రామాలనుంచి పట్టణాలకు తరలినట్లుగానే, క్రమంగా ఒకదేశం నుంచి మరోదేశానికి వలసపోవటం కూడా సాధారణమైంది. అందునా ఆకాశయానం బాగా పెరిగిన తర్వాత, కంప్యూటర్ రాకతో, వెబ్ సృష్టితో ప్రపంచం మొత్తం దగ్గరైన ఈ కాలంలో వలసలు సర్వసాధారణమయ్యాయి. భారతీయులు అసంఖ్యాకంగా ప్రపంచం నలుమూలల్లో వివిధదేశాల్లో, వివిధరంగాల్లో సత్తా చాటుతూ ఆయా తావుల్లో నిలదొక్కుకున్నారు.. విదేశాలకు వెళ్లటం.. అందునా అగ్రదేశమైన అమెరికాలో చదువుకోవటం, ఉన్నతోద్యోగం సాధించటం సగటు విద్యార్థి స్వప్నంగా మారింది. నిన్న..మొన్నటి వరకు అమెరికాలో భారతీయులు భద్రంగానే ఉన్నారు. కానీ అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'మనదేశం..మన ఉద్యోగాలు మనకే' అంటూ రగిల్చిన జాతి విద్వేషం రాజుకొని బతకవచ్చిన భారతీయులనే హతంచేసే వరకు వెళ్లింది.. గన్‌కల్చర్ పెచ్చుమీరిన అగ్రదేశంలో ఇప్పుడు ఆ గన్ తరచు ఇండియన్‌లనే గురిచూడటం అందర్నీ కలవరపరుస్తోంది. వరుస ఘటనలు చాలామందికి 'బతికి ఉంటే బలుసాకు..' సామెతను గుర్తుతెస్తున్నాయనటంలో ఆశ్చర్యంలేదు. ఈనేపథ్యంలో వలస బతుకుల వైనం ఈవారం మీకోసం..

అమెరికాలో జాత్యహంకార ధోరణులు పెరిగిపోతున్నాయి. ఈ ధోరణి భారతీయుల పట్ల మరింతగా పెరుగుతున్నదనడానికి ఇటీవల చోటుచేసుకున్న సంఘటనలే ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పుకోవాలి. ఇక్కడితో ఆగుతాయా అంటే నమ్మకంలేదు. అమెరికా ఫస్ట్, అమెరికా దేశీయులే నాకు ముఖ్యం.. అమెరికా అభివృద్ధే నా ప్రాధాన్యత.. అమెరికా ఆర్థికవృద్ధి నా అజెండా.. అంటూ ఉత్తర్వులపై సంతకాలు చేస్తున్న అమెరికా అధ్యక్షుడుడు డొనాల్డ్ ట్రంప్ పదవీబాధ్యతలుచేపట్టిన తర్వాత ఈ దారుణాలు మరింతగా చోటుచేసుకుంటున్నాయి. ఇళ్లవద్ద నిలుచున్న వ్యక్తులను సైతం కాల్చిపారేస్తున్నారంటే జాత్యహంకారమా? ఒక ప్రత్యేక జాతిపట్ల నెలకొన్న విద్వేషమా ఏది అనుకోవాలి. ఏది ఏమైనా తమ దేశంలో ఇక పరాయి దేశస్థులు ఉండకూడదన్న భావనే ఈమధ్యకాలంలో అమెరికాలో పెరిగిపోతున్న దనడానికి ఈ సంఘటనలు మరింత ఊతం ఇస్తున్నాయి. ప్రపంచంలోని దేశాల్లో అత్యధికంగా 30 దేశాల్లో వలసవాదులు ఎక్కువ మంది ఉన్నారు. ఉపాధి కోసమో.. కెరీర్ వృద్ధికోసమో, అత్యున్నతస్థాయి అవకాశాలు రావడమో వంటి వాటితో ఒక్క భారతీయులే కాదు ఇతర దేశీయులు కూడా అభివృద్ధి చెందిన అగ్రదేశాలకు తరలివెళ్లడం సహజం.

అమెరికా ప్రపంచదేశాలు అన్నింటికంటే ఎక్కువ మంది వలసవాదులు ఉన్నదేశంగా భాసిల్లుతోంది. ఐక్యరాజ్యసమితి రూపొందించిన లెక్కల ప్రకారంచూస్తే మొత్తం 4,57,85,090 మంది వివిధ దేశాలకు చెందినవారు ఇక్కడ నివసిస్తున్నట్లు పౌర వలసల విభాగం అంచనావేసింది.

అసలు ఎందుకు ఇలాంటి వాతావరణం అలుముకుంది? కారణాలు ఏమిటి? ఇదిలా కొనసాగా ల్సిందేనా? జాతివిద్వేషాలతో మరోసారి ప్రపంచం అట్టుడికి పోవాలా అంటే అందుకు పాలకుల విధి విధానాలే కీలకం అవుతున్నాయని స్పష్టంగా చెప్పగలం. అమెరికా తర్వాత అత్యధికంగా వలసలు ఉన్న దేశంగా రష్యా ఉంది. మొత్తం ఒక కోటి 10 లక్షల 48 వేల 064 మంది విదేశీయులు రష్యాలో ఉంటున్నట్లు సమాచారం. ఆ తర్వాత జర్మనీ, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యునైటెడ్ కింగ్‌డమ్ (గ్రేట్‌బ్రిటన్), ఫ్రాన్స్, కెనడా, ఆస్ట్రేలియా, స్పెయిన్, ఇటలీ, భారత్, ఉక్రెయిన్, పాకిస్తాన్, థాయిలాండ్, కజకిస్తాన్, కువైట్, జోర్డాన్, హాంకాంగ్, ఇరాన్, మలేసియా, ఐవరీకోస్ట్, జపాన్, దక్షిణాఫ్రికా, స్విట్జర్లాండ్, సింగపూర్, ఇజ్రాయిల్, నెదర్లాండ్స్, అర్జంటైనా, టర్కీ వంటి దేశాల్లో వలసలు భారీగా ఉన్నట్లు ఐక్యరాజ్యసమితి అంచనావేసింది. ఎక్కువశాతం దేశాలు వలసలు వచ్చిన పౌరులపట్ల సానుకూల ధోరణులతోనే ఉన్నా కొన్ని దేశాలు మాత్రం ప్రతికూలంగా

వ్యవహరిస్తున్నాయి. శరణార్థులు, వలసవాదులపట్ల కొన్నిదేశాలు అకృత్యాలకు పాల్పడుతున్న సంఘటనలు కూడా లేకపోలేదు. యూరోపియన్ కూటమి దేశాల్లో ఇటలీ, గ్రీస్ దేశాలు కొంత కఠిన వైఖరి అవలంబిస్తున్నాయి. జర్మనీ మాత్రం ఎక్కువ స్వేఛ్ఛాయుత

విధానాలను అవలంబిస్తోంది. అంతర్జాతీయంగా వివిధ దేశాలు అనుసరిస్తున్న విధానాల్లో ప్రతిభకు పట్టం కడుతున్న సంఘటన లున్నాయి. భారత్‌పరంగా మేధోసంపత్తికి కొదవలేదు. ఇందులో భాగంగానే అత్యున్నతస్థాయి విద్యను అభ్యసించిన వారికి అమెరికా, ఇంగ్లండ్, కెనడా, ఫ్రాన్స్ వంటి అగ్రరాజ్యాలు, అభివృద్ధిచెందిన దేశాల్లో అత్యున్నత ప్రమాణాలున్న వర్సిటీల్లో సైతం కొలువులు దక్కుతున్నాయి.

ప్రపంచ దేశాల్లో ఎక్కువగా సానుకూల వైఖరితో ఉన్న దేశాల్లో జర్మనీ 66శాతం బ్రిటన్ 52శాతం, అమెరికా 51శాతం, స్పెయిన్ 47శాతం, ఫ్రాన్స్ 45శాతం, పోలండ్ 24శాతం, గ్రీస్, ఇటలీ దేశాలు 19శాతం సానుకూలంగా వ్యవహరిస్తున్నాయి. దీన్నిబట్టి వివిధ దేశాలమధ్య కొత్తగా వచ్చేవారిని అనుమతించడంపై ఎక్కువ తారతమ్యాలున్నాయి. వలసల విధాన సంస్థ (మైగ్రేషన్ పాలసీ ఇన్‌స్టిట్యూట్) పరంగాచూస్తే యూరోపియన్ యూనియన్, ఐరోపా స్వేఛ్ఛా వాణిజ్యసంఘం ఉన్న దేశాలమధ్య వలసలు పదిదేశాల్లో మొత్తం 9,00,730 వరకూ ఉన్నట్లు అంచనా. ఈ దేశాల్లో పదిదేశాలపరంగా సిరియా 2,21,730, ఆఫ్ఘనిస్థాన్ 1,02,705, ఇరాక్ 69,640, కొసావో 68చ930, అల్బేనియా 54,340, పాకిస్తాన్ 36,680, ఎరిత్రియా 35,990, సెర్బియా 24,910, సెర్బిఇయా 24,910, నైజీరియా 23,195, ఉక్రెయిన్ 17,200 మందివరకూ వివిధ దేశాలకు పోయేందుకు దరఖాస్తులుచేసారు. ఇక మధ్యదరా దేశాల్లోని జోర్డాన్, లెబనాన్, టర్కీ దేశాలు మూడు కలిపితే ఇటీవల సిరియాలో నెలకొన్న పరిణామాల నేపథ్యంలో మొత్తం పదిలక్షలమందికిపైగా శరణార్థులకు ఆశ్రయం ఇస్తున్నాయి.

మధ్య తూర్పుదేశాలు, ఐరోపా కూటమి దేశాల్లో నెలకొన్న ఈ విధానాలను పరిష్కరించేందుకు ఐక్యరాజ్యసమితి కూడా ఎప్పటికప్పుడు దృష్టిసారిస్తోంది. స్వదేశాల్లో నెలకొన్న అనిశ్చితి, ఉద్రిక్త యుద్ధవాతావరణాలతో సామాన్య అమాయక పౌరులు పొట్టచేతబట్టుకుని పొరుగునే ఉన్న దేశాలకు వలసపోవడం ఒక కారణం అయితే అగ్రదేశాలు, అభివృద్ధి చెందిన దేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్లే వలసవాదులు మరికొందరు. మొత్తం శరణార్థులు, వలసవాదుల పట్ల కొంతమేర కొన్ని దేశాలు సంక్లిష్ట నిబంధనలు అమలుచేస్తున్నాయి. ప్రపంచం మొత్తంగాచూస్తే మొత్తం 232 మిలియన్ల మంది వలసవాదులు వివిధదేశాల్లో నివసిస్తున్నారు.

తమతమ స్వదేశాలను వీడిపోయేందుకు గల కారణాలు కొన్ని విచిత్రంగా కూడా ఉన్నాయి. కొన్ని సహజవనరుల లేమి, ప్రకృతి వైపరీత్యాలు కరువు, కాటకాలు, క్షామం, దుర్భిక్షం, పేదరికం, రాజకీయ వాతావరణం, వ్యక్తిగత స్వేఛ్ఛ కొరవడటం వంటి కారణాలు కీలకం అవుతున్నాయి. మరికొన్ని విశృంఖల సెక్స్ జీవితాలకు అలవాటుపడినవారు కూడా తమకు అనువైన దేశాలకు వెళ్లి స్థిరనివాసం ఏర్పరుచుకుంటున్నారు. మరికొందరు సంస్కృతి సాంప్రదాయాలు, భౌగోళికంగా సిరిసంపదలు ఎక్కువ ఉండటం, ఉపాధికి అవకాశాలు మరింతగా పెరగడం వల్ల ఎక్కువ ఆయా అగ్రదేశాల్లో నివసించేందుకే ప్రాధాన్యతనిస్తున్నారు. ఎక్కువగా వీరంతా ఉన్నత ఉద్యోగాల కొలువులకోసం వెళుతున్నవారైతే, మరికొందరు వ్యాపారాలుచేసి వివిధ దేశాల్లో స్థిరనివాసం ఏర్పాటుచేసుకున్నవారు అత్యధికంగా ఉన్నారు.

ప్రపంచంలోని అన్నిదేశాలనుంచి వస్తున్న వలసలు ఎక్కువగా కేవలం పదిదేశాల్లో మాత్రమే ఉన్నాయి. ఎక్కువ ఆదాయ వనరులున్న దేశాలు కావడం, ఆర్థికవృద్ధి శరవేగంతో ముందుకు వెళుతుండటంతో ఆయాదేశాల్లో ఉపాధి అవకాశాలు కూడా భారీ ఎత్తున పెరుగుతున్నాయి. వలసలు ఎక్కువ పోవడానికి ఇదే కారణం అని అంతర్జాతీయ నిపుణులు, సర్వే సంస్థలు, చివరకు ఐక్యరాజ్యసమితి కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి. ఉదాహరణకు యూరోపియన్ యూనియన్ దేశం అయిన స్పెయిన్‌లో 46.7మిలియన్ల జనాభాలో 12శాతం మంది విదేశీ సంతతికి చెందినవారే ఉన్నారు.

ఇటీవలికాలంలో మరింత ఎక్కువమంది వలసవస్తున్న దేశంగా నిలిచింది. 6.5 మిలియన్ల మంది వలసవాదులున్నారు. విదేశీ విద్య, ప్రవాస జీవితాలకు ఈ దేశం నెలవుగా మారింది. తర్వాత ఆస్ట్రేలియాలో 6.5 మిలియన్ల మంది ఉన్నారు. ఆ తర్వాత 35 మిలియన్ల జనాభా ఉన్న కెనడాలో కూడా ఎక్కువ మంది వలసవాదులున్నారు. 7.3 మిలియన్ల మందివరకూ

ఉన్నట్లు అంచనా. కొలువుల్లో ప్రతిభ, పట్టు, సామర్థ్యం ఆధారంగా వీరికి ఉపాధిని అందిస్తున్నాయి. ఇక ఫ్రాన్స్ పరంగాచూస్తే 7.4 మిలియన్ల మందికి పైగా శరణార్థులున్నారు. ఏడాదికి రెండులక్షల మందికి మించకుండా వలసవాదులను ఈ దేశం అనుమతిస్తోంది. ఈదేశంనుంచి యూరోపియన్ కూటమి దేశాలకు స్వేఛ్ఛా విహారానికి అనుమతులిచ్చింది. అయితే ఈ దేశం ఇటీవలికాలంలో

రొమేని దేశస్థులను తమ సరిహద్దులనుంచి వెళ్లగొట్టడంపట్ల విమర్శలు ఎదుర్కొన్నది. ఇక అన్నింటికంటే 64 మిలియన్ల జనాభాలో 12.4శాతం మంది వలసవాదులున్నారు. ప్రపంచంలోనే ఆరో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ ఉన్న దేశంగా ఉన్న బ్రిటన్‌లో వలసలు పెరిగిపోవడాన్ని ఆదేశం కూడా ఆందోళన వ్యక్తంచేసింది. ఇక బ్రెగ్జిట్ అనంతరపరిణామాల నేపథ్యంలో ఈదేశం సొంత విధివిధానాలతో వలసలను కొంత కట్టడిచేసుకోవచ్చని అంచనా. ఇక వలసల్లో అత్యధికులు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో 83.7శాతం మంది విదేశాలనుంచి వచ్చినవారే ఉన్నారు. ఎక్కువశాతం ఆసియా దేశాలనుంచే వస్తున్నవారున్నారు. చమురు సుసంపన్నదేశంగా ఉన్న యుఎఇ విదేశీ కార్మికులను ఎక్కువ ఆకర్షిస్తోంది. ఇక గల్ఫ్‌దేశాల్లో కీలకమైన సౌదీ అరేబియాలో 29.1 మిలియన్ల జనాభాలో 24.3శాతం మంది వలసజనమే ఉన్నారు.

సౌదీ,యెమెన్‌లమధ్య గోడ నిర్మాణం కోసం ఎక్కువశాతం ఇథియోపియన్లను కార్మికులుగా తీసుకుంటున్నది. అయితే వారికి పౌరసత్వం ఇవ్వడంలోను, అక్రమ వలసలను కట్టడిచేయడంకోసం సంక్లిష్ట విధానాలను ప్రవేశపెట్టింది.

ట్రంప్ విధానాలే కీలకం అవుతున్నాయా!

అమెరికా అధ్యక్షునిగా రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కొత్త కొత్త విధానాలు అమలవవుతున్నాయి. ఏడు ముస్లిందేశాలపై 190 రోజులపాటు శరణార్థులను నిలిపివేసిన దేశం ఆ తర్వాత తాజాగా ఆరుదేశాలకు కుదించింది హెచ్‌వన్‌బి వీసాల అమలుపై విపరీత ఆంక్షలను ప్రవేశపెట్టడం ద్వారా దాదాపు 20 లక్షల మందికిపైగా ఉన్న భారతీయులకు నేడు సమస్యలు ఎదురవుతున్నాయి. ఎక్కువశాతం భారతీయులు వ్యాపారంకోసం వచ్చి స్థిరపడినవారైతే మరికొన్ని భారతీయ కంపెనీలు సైతం అమెరికాల్లో యూనిట్లు స్థాపించాయి. ఇక మిలిన వారంతా ఐటి ఇతర ఐటిసేవల రంగంలోఉన్నత కొలువుల్లో కొనసాగుతున్నవారే కావడం గమనార్హం.

ఇక భారత్‌లోని కంపెనీలు తమ పొరుగుసేవలకోసం హెచ్‌వన్‌బి వీసా ఆధారంగా ఉద్యోగులను తమ కంపెనీలకు పంపిస్తున్నాయి. వారంతా అక్కడకు ఇదే వీసాపై వెళ్లి ఉపాధి పొందుతున్నారు. అంతవరకూ బాగానే ఉన్న ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే హెచ్‌వన్‌బి వీసాలపై ఆంక్షలను తీసుకువచ్చారు. వారి వేతన పరిమితి లక్ష డాలర్లకు పెంచేశారు. దీనితో భారతీయ ఐటి కంపెనీలకు ఎక్కువ భారం పడుతున్నట్లు భావించాయి. మెక్సికో సరిహద్దు వెంబడి ప్రహరీ నిర్మాణం చేస్తామని ప్రకటించిన ట్రంప్, ముస్లిందేశాలనుంచి పెరుగుతున్న వలసలవల్లనే ఉగ్రవాదఛాయలు అలుముకుంటున్నాయన్న భావనతో ఏడు ముస్లిం దేశాలనుంచి వచ్చే వలసవాదులపై ఆంక్షలు నిషేధం ప్రకటించారు. ఎక్కువశాతం భారత్‌పరంగాచూస్తే ఉపాధి కోసం వెళ్ళినారే ఉన్నారు.

వైద్యవృత్తిలో ఉన్నవారు, ఫార్మారంగంలో ఉన్నత కొలువుల్లో ఉన్నవారితోపాటు అత్యధికంగా ఐటి సేవల రంగంలో కొనసాగుతున్నవారే ఉన్నారు. ఆంక్షలపై వెల్లువెత్తిన నిరసనలు, న్యాయస్థానాల్లో కూడా చుక్కెదురు కావడంతో పర్యాటక వీసాల నిషేధంపై ట్రంప్ సర్దుబాటుధోరణి అవలంబించారు. ప్రస్తుతం ఈజాబితానుంచి ఇరాక్‌ను మినహాయించారు. ఇరాక్‌లో తనిఖీలు, వీసాస్క్రీనింగ్, డేటా షేరింగ్‌పై ఇరాక్ ప్రభుత్వంతో చర్చించానని ఆదేశం చర్యలు సంతృప్తికరంగా ఉన్నందు వల్లనే నిషేధిత జాబితానుంచి ఇరాక్‌ను తొలగిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. శరణార్థులపై సాధారణంగా 120 రోజులు నిషేధం ఉంది. ఏడాదికి 50 వేల మందికి రిమితిని విధించారు. నిషేధం విధించిన దేశాల్లోని పౌరులకు గ్రీన్‌కార్డు ఉంటే అనుమతిస్తారు. సిరియానుంచి వచ్చే క్రైస్తవ శరణార్థులకు కొత్త ఆ దేశాల్లో ప్రాధాన్యం కరువైంది. పాత ఆదేశాల్లో మతపరమైన మైనార్టీలకు ప్రాధాన్యం ఇచ్చారు.

మరోవైపు ట్రంప్ తాజా ఆదేశాల్లో వివాదాస్పద అంశాలు తొలగించినా వీటిని కూడా కోర్టుల్లో సవాల్‌చేసే అవకాశం లేకపోలేదు. అయితే ట్రంప్ చేపట్టిన నినాదం మాత్రం అమెరికన్లలో పటిష్టమైన బీజాలు వేసింది. ఒకప్పుడు స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య దేశంగా యువత కలల ప్రపంచంగా అవకాశాల గనిగా పేరుగాంచిన అమెరికాలో జాత్యహంకార విద్వేషం జడలు విప్పుకోవడంపై భారతీయుల్లో తీవ్ర ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బతకాల్సిన పరిస్థితి నెలకొంది. కాలిఫోర్నియాలో కారు తగిలిందని వరంగల్ యువకుడు వంశీరెడ్డిని తుపాకితో కాల్చి చంపిన ఉదంతం మరువకముందే కెన్సాస్‌లో శ్వేతజాతీయుడి మానసిక చిత్తచాంచల్యం కారణంగా కూచిభొట్ల శ్రీనివాస్ అనే ఇంజనీర్ మరణించాడు. ఆతని స్నేహితుడు మాదసాని అలోక్‌రెడ్డి

తీవ్రంగా గాయపడ్డాడు. దక్షిణ కొలరాడోలో మరో భారతీయుడి ఇంటిపై దాడి. దక్షిణ కరోలినాలో భారతీయ వ్యాపారి హర్నీష్ పటేల్ హత్య ఇలాంటి సంఘటనలు ఇంకెన్ని జరుగుతాయోనన్న భయాందోళనలు పెరుగుతున్నాయి. ట్రంప్ అధ్యక్షునిగా చేపట్టేందుకు వినియోగించిన ఎన్నికల ప్రచార అజెండాయే నేడు శ్వేతజాతీయుల్లో ఇతర దేశీయులపట్ల విద్వేషాగ్నిని రగుల్చుతోంది. ప్రత్యేకించి భారతీయులంటే ఇపుడు వారిలో ఏహ్యాభావం రగిలిపోతోంది.

అమెరికా అంటేనే వలసవాదుల దేశంగా గణుతికెక్కింది. అమెరికన్ల జాతి వలసలజాతి. ఆదేశం పుట్టుక నిర్మాణం అభివృద్ధిప్రయాణం అంతా వలసలతోనే ముడిపడిఉంది. ఆసియన్లలోఎక్కువభాగం భారతీయులు అందులోను తెలుగువారు మాత్రమే వలసదారులనుకోవడం పొరపాటు. అమెరికాలో నివసిస్తున్నవారిలో ఎక్కువశాతం ఇతరదేశాలనుంచి వచ్చి నివసిస్తున్నావారే. అసలు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఆయన కుటుంబం సైతం వలసదారులే. ట్రంప్ పూర్వీకులు జర్మనీకి చెందినవారు. ప్రధానంగా ఐరోపా లాటిన్ అమెరికా, ఆఫ్రికా చైనా, భారత్ తదితర ఆసియా దేశాల వలసలతో ప్రస్తుతం అమెరికా వలసవాదుల రాజ్యంగా భాసిల్లింది. ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్‌జుకర్‌బెర్గ్ సైతం ఇదే స్పష్టంచేసారు. అమెరికాలో నివసిస్తున్న వారిలో మూడోవంతు వలసలరూపంలో వచ్చినవారే. శ్వేతజాతీయుల్లో వలసవాదులు అమెరికాలో పాతుకునిపోతున్నారన్న దుగ్ధ పెరిగిపోతోంది. అమెరికా జనాభాలో మెక్సికో, లాటిన్ అమెరికా మూలాలున్నవారిని మినహాయిస్తే ఐదు దశాబ్దాల క్రితం శ్వేతజాతీయులు 90శాతం వరకూ ఉన్నారు. ఇపుడు వారిసంఖ్య 62శాతానికి పడిపోయింది. 2043 నాటికి 50శాతం కంటే దిగువకు చేరుతుందన్న అంచనా అమెరికన్లను కలవరపెడుతోంది. ఇతరులపై దాడులు దౌర్జన్యాలకు పూనుకుంటున్నారు. మితవాదాన్ని ఉపయోగించుకుని అధ్యక్ష ఎన్నికల్లోట్రంప్ విజయఢంకా మోగిడంచడంతో వారి జాత్యహంకార దుందుడుకు చర్యలకు అడ్డూ అదుపూ లేకుండా జాత్యహంకార దాడులు యధేచ్ఛగా సాగితున్నాయి. ఏడాదికాలంలోనే వెయ్యికిపైగా ఇటువంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. వలసవాదులపై వ్యతిరేకతతో నమోదయిన కేసులే 350కిపైగా ఉన్నాయి.

సహజంగా భారతీయులన్నా, సంస్కృతి సాంప్రదాయాలన్నా అమెరికన్లు ఎక్కువ గౌరవిస్తారు. అయితే ఉన్నతచదవులు చదివిన భారతీయులు ఎక్కువ సంఖ్యలో రావడం వల్ల తమ కొలువులు వారు తన్నుకుని పోతున్నారనన భావన పెరిగిపోయింది.

కూచిభొట్ల శ్రీనివాస్..

అలోక్


హర్నీష్‌పటేల్..

పశ్చిమాసియా దేశాలవారని పొరపాటుపడటం, సిక్కులను చూసి అరబ్‌దేశాల్లోని ముస్లింలుగా భావించడం వంటివి భారతీయులపై దాడులకు హేతువవుతున్నాయి. తమ ఉద్యోగాలన్నింటినీ దోచుకుని నిరుద్యోగులుగా మారుస్తున్నారన్న భావన వారిలో పాతుకుని పోయింది.

సాధారణంగా ఎక్కువ మంది 12వ తరగతి తర్వాత తక్కువ మంది మాత్రమే ఉన్నత విద్యకు వెళతారు. పెద్దగా నైపుణ్యాలు అవసరమైన ఉద్యోగాలజోలికి వెళ్లరు. అక్కడ ఉద్యోగాలుచేస్తున్న భారతీయులంతా నిపుణులే. భారతీయ విద్యార్థులు, వర్సిటీ ప్రాంగణాల వెలుపల చట్టవ్యతిరేకంగా చిన్నాచితకా తాత్కాలిక ద్యోగాలుచేస్తారు. పైగా భారతీయుల సగటు వేతనం లక్షడాలర్లుగా ఉంటుంది. అమెరికన్ల సగటు వేతనం 45వేల డాలర్లే. ఇవన్నీ అమెరికన్లకు కడుపుమంట మండిస్తున్నాయి. అమెరికన్లు సాధారణంగా యూదులు అంటే అసలు ఇష్టపడరు. యూదులు అత్యంత సంపన్నులు, ఉద్యోగం చేసేందుకు ఇష్టపడరు. వ్యాపారాలు చేస్తారు. వారిపై అమెరికన్లు దాడులకు పూనుకోరు. ఉద్యోగాలుచేసే భారతీయులపట్ల మాత్రం అసహనంతో ఉంటారు.

అమెరికాలో ప్రబలిన తుపాకీ సంస్కృతి మత్తుపదార్థాల రాక పెరగడం వంటివాటితో పరిస్థితులు మరింత క్షీణిస్తున్నాయి. 21 ఏళ్లు దాటితే తుపాకీలు సమకూర్చుకోవచ్చు. నేరాలకు కారణం అవుతున్న తుపాకీ సంస్కృతిని కట్టడిచేసేందుకు బరాక్ ఒబామా పెద్దప్రయత్నమే చేసారు. కాంగ్రెస్ మద్దతివ్వకపోవడంతో ఆయన కృషి కొలిక్కిరాలేదు. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో కొన్ని మత్తుపదార్థాలు విచ్చలవిడిగా లభించేవిగా ఉన్నా మరికొన్నింటిలో అసలు కఠినమైన ఆంక్షలు అమలవుతాయి. అమెరికాలో ప్రస్తుత పరిస్థితులపట్ల కలవరం వ్యక్తంచేస్తున్న ఉద్యోగులు కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఐర్లాండ్, డెన్మార్క్ వంటి దేశాలకు తరలివెళ్లేందుకు చూస్తున్నారు. అయితే రోమ్‌లో రోమన్‌లా ఉండాలన్న సామెతను బట్టిచూస్తే అమెరికాలో ఇపుడు భారతీయులంతా అమెరికన్‌లలా ఉండాలన్నది ఎంతోముఖ్యం. ఎవరు భారతీయులు కలుసుకున్నా ఇంగ్లీషు తప్ప తమ సొంతభాష మాట్లాడుకోవదన్న అక్కడి భారతీయ సంఘాల సూచనలు జారీచేసాయంటే అమెరికాలో ప్రస్తుత పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయో ఇట్టే అవగతం అవుతుంది. భారత్‌ప్రభుత్వం చేపట్టనున్న చొరవ, కార్యాచరణలే ఇందుకు కీలకం అవుతాయని మాత్రం చెప్పాలి.

‘హాయిగా నవ్వించే ‘హాస్య’మాణిక్యం’

మార్చి 15 మునిమాణిక్యం నరసింహారావు జయంతి

తెలుగు హాస్యకథా రచయితల్లో ముందువరుసలో నిలిచే ఆణిముత్యం మా గురుదేవులు మునిమాణిక్యం నరసింహారావు. వీరు 1893లో మార్చి 15న గుంటూరు జిల్లా సంగం జాగర్లమూడిలో జన్మించారు. తల్లిదండ్రులు రుక్మిణమ్మ, సూర్యనారాయణ. మునిమాణిక్యంవారికి బాల్యంలోనే తల్లి మరణించడంతో పెదరావూరులో ఉన్న మేనత్త ఇంట పెరిగారు. విజయనగరంలో బి.ఎ., రాజమండ్రిలో ఎల్.టి. చదువుకున్నారు. ఉపాధ్యాయుడిగా గుంటూరు, మచిలీపట్నం, భీమవరం, వేటపాలెం, వరంగల్ జిల్లాలోని బచ్చన్నపేటలలో పనిచేశారు. ఆ తర్వాత ఆయన హైదరాబాద్ చేరుకున్నాక కొంతకాలం ఆకాశవాణి కేంద్రంలో విద్యావిషయక కార్యక్రమాలకు ప్రయోక్తగా పనిచేశారు. పిదప తిలక్‌రోడ్డులోని ఆంధ్ర సారస్వత పరిషత్‌లో పండిత శిక్షణ కళాశాలలో ఆచార్యుడిగా, ప్రధానాచార్యులుగా పనిచేశారు. మునిమాణిక్యంగారు మాకు పండిట్ ట్రైనింగ్ కళాశాలలో సైకాలజీ పేపర్ బోధిస్తుండేవారు.

తెలుగు కథా సాహిత్యంలో ‘కాంతం కథల’కు ప్రత్యేకత ఈనాటికీ చెక్కుచెదరకుండా ఉంది. వీరి కాంతం పాత్ర అపురూపమైన సృష్టి. అసలు ఎవరండీ ‘కాంతం’. ఆయాన భార్యామణిగానే వెలుగుచూసింది.. కానీ కాదు.

డిగ్రీ చదివేరోజుల్లోనే ఆయన తల్లావఝుల శివశంకరశాస్త్రి ప్రోత్సాహంతో పద్య, గేయ రచనలు మొదలుపెట్టారు. అవి అంతంత మాత్రంగానే సాగినా, తర్వాత తర్వాత వారు మానవస్వభావాల్ని, జీవన విధానాల్ని పూర్తిగా ఆకళింపు చేసుకున్న మీదట ‘నొప్పింపక తానొవ్వక’ అన్నట్లు సంసారం అనే నావకు చుక్కాని తిప్పిన కాంతాన్ని ప్రతి తెలుగింటి ఇల్లాలికీ ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దారు.

తొలిసారిగా కాంతం, రావుగారి ‘టీ కప్పులో తుఫాను’ అనే నవలలో దర్శనమిస్తుంది. అసలు కాంతం పాత్ర సృష్టికి మూలకందం, ప్రేరణ కూడా ఆయన మొదటి భార్య శేషగిరమ్మేనని చెబుతుండేవారాయన. గిలిగింతలు పెట్టే హాస్యానికి ఉత్ప్రేరకాలై భాసిల్లినందువల్ల కాంతం కథలు వాటికవే సాటిగా నిలిచాయి. వీరి కలం సృష్టించిన అపూర్వ కథానాయిక ‘కాంతం’. మొదట్లో స్నిగ్ధ, తర్వాత ముగ్ధ. అందుకు ఉదాహరణగా చెప్పుకోవలసిన కథ ‘ఎనిమిదీ ఎనిమిదీ’. ఇదే ఒరవడిలో వెన్నెలలో, ది పర్‌ఫెక్ట్ లైఫ్, బదనసీహత్, ఇంట్లో విరహం, కాంతం వృద్ధాప్యం, కాంతం పేరంటం, హంపీ ప్రయాణం, నీలికొండలు, మొండివాదన, పిల్లలు గల తల్లి, ప్రయాణ సన్నాహం.. ఇవన్నీ కాంతం కథల్లో చోటుచేసుకున్న

గార్హస్థ్య జీవితం తాలూకు జరిగిన ముచ్చట్లకు అద్దంపట్టేవిగా నిలుస్తాయి. కాంతం స్వాధీన పతికగానే చివరివరకు ఉండదు. విభిన్న సందర్భాలలో సందర్భానికి తగినట్లు వాసవ సజ్జికగా, విరహోత్కంఠితగా, ఖండితగా, కలహాంతరితగా, విప్రలబ్ధగా, ప్రోషిత భర్తృకగా ఒక్కో సన్నివేశంలో ఒక్కో విధంగా దర్శనమిస్తుంది.

మునిమాణిక్యంగారు నేను- మాకాంతం, కాంతం కైఫీయత్తు, కాంతం కాపరం.. కథా సంకలనాలు ఎన్నో రాయడం మనకు తెలుసు. తిరుమాళిక, రుక్కుతల్లి, శరద్రాత్రులు, దీక్షితులు నవలలు.. అన్నయ్య మంత్రి, క్లింగ్ లింగుల కథ, వక్రరేఖ తదితర ఎన్నో నవలల్ని విద్యార్థులకు ఉపయోగపడే పంథాలో రాయడం జరిగింది. వీటికి తోడు అనేక దృశ్య, శ్రవ్యనాటికలు ఆయన లేఖిని నుండి ఆకాశవాణికోసం వెలువరించినవిగా చెప్పుకోవచ్చు. వీరు రాసిన ‘తిరుగుబాటు’ నాటకం విప్లవధోరణిలో రాసింది. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం ఆ నాటకాన్ని నిషేధించింది కూడా. తెలుగులో మునిమాణిక్యంవారు హాస్యం గురించి ప్రత్యేకంగా రచించిన ఉద్గ్రంథం ‘మన హాస్యం’. ఇది విశేష ప్రాచుర్యం పొందింది. ఇంకా వీరి ప్రసిద్ధ రచనల్లో దాంపత్యోపనిషత్, ఇంటావిడతో పోట్లాట, ప్రణయ కలహం, అప్పులు చేయడం, తీర్చడం, కాంతంగారి సీతయ్య, గాలిపిల్లలు, వితండవాదాలు, మాట నేర్పరితనం, గాడిదల తిరుగుబాటు .. ఇలా ఎన్నెన్నో ఉన్నాయి. ఆయన రచనల్లో ఎన్నో వివిధ భారతీయ భాషల్లో అనువాదమయ్యాయి. హిందీలో అనువాదమైన కథలు విశేష ప్రఖ్యాతి పొందాయి.

ఫస్ట్‌కేస్ వ్యంగ్య కథ హాస్య సంభరితంగా ఇన్సూరెన్స్ ఏజెంట్ల తిప్పల్ని, వారి జీవన విధానాల్ని చిత్రించిన కథ. ఆయనకు సాహిత్యవేత్తగా ఆనాటి సాహిత్య అకాడెమీ విశిష్ట పురస్కారం అందుకోగలిగారు. కాంతా మనోహరుడు, కథక చక్రవర్తి, హాస్య పరమేశ్వర, మార్గదర్శి మహర్షి వంటి పలు బిరుదులు ఆయన స్వంతం చేసుకోగలిగారు. సాహిత్య అకాడెమీ సభ్యుడుగా, నాటక పరిశోధనమండలి ఉపాధ్యక్షుడిగా పని చేయడం వారి ప్రతిభకు తార్కాణం.

ఏ కథలో చూసినా కాంతమే విజయం సాధించడానికి ముఖ్య కారణం ఆయనలో దాగిన స్త్రీవాద మమకారం. యత్రనార్యస్తు పూజ్యంతే..అన్నది వారు నమ్మిన ఆదర్శం. ఆలుమగలన్నాక ఆ ఇద్దరి మధ్య పొరపొచ్చాలు, పోట్లాటలు రావచ్చును. అలాగని తెగేదాకా లాగకూడదన్నది వారి సిద్ధాంతం. రసహృదయంతో ఆనందాన్ని పొందాలనేది వారి సిద్ధాంతం

మునిమాణిక్యం వారి కాంతం అన్ని వయసులలో గల కథల్లో, భిన్నమైన స్థితి గతుల్లో మనకు సంసారపరమైన జ్ఞానాన్ని కథాపరంగా బోధిస్తున్న ఉపాధ్యాయినిగా సాక్షాత్కరిస్తుంది. ఇలా విశేష హాస్యాన్ని విస్తృతంగా తెలుగువారికి అందించిన మునిమాణిక్యం వారు 1973 ఫిబ్రవరి 4న కన్నుమూశారు.

-మంతెన సూర్యనారాయణ రాజు

కృతి

మానవత్వం పరిమళించిన కథలు



పదనిరాడంబరత్వం, సూటిదనం, క్లుప్తత.. ఈమూడు సి.యమునగారి కథల్లో గోచరిస్తాయి. వారి 'రెక్క లొచ్చాయి' కథా సంపుటిలోని 18 కథలూ సమకాలీన సమాజాన్ని ప్రతిబింబించాయి. కథలన్నిటా మధ్యతరగతి, కాస్త ఎగువ మధ్య తరగతి జీవితాలు, ఆలోచనలు, అనుబంధాలు అభివ్యక్తమవుతాయి. ప్రకృతిని, పరిసరాల్ని, చాలా దగ్గరగా పరిశీలించగలిగే నేర్పుగల వీరి కథల్లో పావురాలు కూడా పాత్రధారులు కావడం విశేషం. ఉన్నది ఉన్నట్లుగా సూటిగా చెపితే, మనసు నొచ్చుకోవచ్చు. నిరాశకు లోను కావచ్చు. కానీ ఇలా సూటిగా చెప్పటం వల్ల బలహీనత అవగతమై, పట్టుదల పెరిగేందుకు దోహదపడుతుందంటారు ఆ నలుగురు'లో. అమ్మమ్మల నాటితరం 'పాత చింతకాయపచ్చడి' కానవసరంలేదని, కొత్తపాతల మధ్య వారు వారధివేయగలరని 'నిత్యయవ్వని అమ్మమ్మ' లో చెబుతారు. శివరాత్రి రోజున శివునికి అభిషేకం చేసినంత పుణ్యం ఒకరి దాహార్తి తీరిస్తే వస్తుందని, మానవ సేవే మాధవ సేవ అని 'శివోహం'లో వివరిస్తారు. పక్షులు కాస్త ఎదగగానే, రెక్కలు రాగానే గూడు విడిచిపోవటం సహజమని మనుషుల్నీ, పావురాల్ని పోలుస్తూ 'రెక్కలొచ్చాయి'లో చెబుతారు. మానవ సంబంధాల్ని, సహజంగా కలిగే కోపతాపాల్నీ, జీవనసత్యాల్ని ఎంతో ప్రభావ పూరితంగా చెప్పగలిగారు. ప్రతి కథలోను ఒక సందేశం అందించారు.

(రెక్కలొచ్చాయి -కథలు: సి.యమున; వెల: రూ.100; ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు)

-కూర చిదంబరం

దాశరథి చిత్ర గీతాల మధురిమలు

పాట, పద్యం, గేయం, గీతం..ఏది రచించినా మృదుమధుర పదాల పొందికతో, భావగాంభీర్యంతో, భక్తి, వైరాగ్య, ఆధ్యాత్మిక, విప్లవ రసాత్మక స్ఫూర్తితో మహాకవి స్థానాన్ని సాధించారు దాశరథి. ఆయన రచించిన భక్తిగీతాల్లో 'రారా క్రిష్టయ్యా, నడిరేయి ఏ జాములో' వంటివి ప్రాచుర్యం పొందాయి. ప్రణయ గీతాల్లో 'ఖుషీఖుషీగానవ్వుతూ, నా కంటిపాపలో నిలిచిపోరా, నన్ను వదిలి నీవు పోలేవులే..ఇలా ఎన్నో! 'మూగమనసులు'లో గోదారి గట్టుంది' పాట ఎంతో ప్రాచుర్యంపొందింది. ఈ పాటలో ప్రతి చరణంలో వేదాంతం నిగూఢమై ఉంది. పల్లవిలోనే ఆయన జీవాత్మకు, సృష్టికి ఉన్న సంబంధాన్ని మలచగలిగారు. 'గోదావరి' అనే విశ్వాంతరాళంలో గట్టు అనే భూమిపైన, చెట్టు అనే దేహం, ఆచెట్టు కొమ్మన పిట్ట అనే ఆత్మను మనకళ్లముందు సాక్షాత్కరింపజేశారు. అదేపాటలో 'పిట్ట మనసు పిసరంతైనా ప్రపంచమంత దాగుంది' అనే వేదాంతాన్ని పండించారు. చిన్నపాటలో అంత వేదాంతం ఇమడ్చగలగడం ఆయనకే సాధ్యం. కె.ప్రభాకర్ సంపాదకత్వంలో 'దాశరథి సినిమా పాటల పందిరి' పుస్తకం వెలువడటం ముదావహం. ఈ పుస్తకంలో ఎందరో ప్రముఖ రచయితలు దాశరథి పాటల గురించి అందించిన విశ్లేషణ వ్యాసాలు విలువైనవిగా, ఆసక్తికరంగా ఉన్నాయి.

(దాశరథి సినిమాపాటల పందిరి-కె.ప్రభాకర్; వెల:రూ.350; ప్రతులకు: కె. విమలారాణి, హెచ్ఐజిబ్లాక్ నం.1, ఫ్లాట్‌నం:104, డా.ఎమ్.ప్రభాకర్‌రెడ్డి చిత్రపురి కాలనీ, మణికొండ, హైదరాబాద్-500008)

-పెట్ల వెంకటేశం

మనసుల్ని దోచే గేయాలు

ఆమధ్య 'నేనెక్కడ్నో తప్పిపోయిన' అంటూ కవన ప్రవాహంలో మునకలేసిన ప్రముఖ కవి తుమ్మూరి రాంమోహన్‌రావు 'ఎలకోయిల పాట'ను ఆలపిస్తూ, ఆ గేయాలతో ప్రత్యక్షమయ్యారు. ఈ కవి వెలువరించిన ఐదు పొత్తాల్లో ఇది రెండవ గేయ సంపుటి. పదవీ విరమణ తర్వాత సాహితీ వనంలో తన కవితలతో.. గేయాలతో సేదతీరుతూ గొంతెత్తిన కోయిలలా కుహూ కుహూ మంటున్నాడు ఈకవి. పలు సందర్భాల్లో రాసిన గేయాలు, పాటలను సుస్వర నవరాగతరంగిణి, ప్రతిభకు పాటల పందిరి, తరుణ గీతాల తోరణం.. అంటూ మూడు విభాగాల్లో పొందుపరిచిన గేయప్రియులకందించారు. ప్రకృతిని, పరిసరాల్ని, జీవన సందర్భాన్ని, తను ఆరాధించే సాహితీ స్రష్టల్ని స్మరిస్తూ, స్తుతిస్తూ భావావేశంతో ఉప్పొంగిన ఒకపుటకు మించని గేయాలు యివి. గాయకులు బాణీకట్టి పాడుకునేలా, పాడుకోలేనివారు కవిత్వంగా ఆస్వాదించేలా సరళభాషలో సాగిన రచనలు. కనులుంటే చాలవేమొ/ చూపులోతు కావాలి/ వీనులుంటే సరిపోదు/ హృదయలయలు వినగలగాలి.. వంటి భావగర్భిత గేయాలతో బాటు 'పాటతోడై మాటనీవై/ పరుగుతీసే పయనమా' అంటూ పసిడి నవ్వులు వెదజల్లిన పరిమళం సాహితీ ప్రియుల మనస్సులను దోచేయటం ఖాయం. ఈ 'ఎలకోయిల పాట' పదుగురి నోట ప్రతిధ్వనిస్తుందని నా నమ్మకం.

(ఎలకోయిల పాట -గేయ సంపుటి:తుమ్మూరి రాంమోహన్‌రావు (వాధూలస); వెల:రూ.150 ప్రతులకు: ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు)

-రమణ వెలమకన్ని

ఆసాంతం ఆసక్తికరం..



తెలుగు బౌద్ధ తాత్త్విక దిగ్గజాలు ఏడుగురు. వారు .. ఆచార్య నాగార్జునుడు, ఆర్యదేవుడు, బుద్ధపాలితుడు, భావ వివేకుడు, బుద్ధఘోషుడు, దిగ్నాగుడు, ధర్మకీర్తి. బౌద్ధం మానవీయ సిద్ధాంతం. అమరావతి నాగార్జునసాగర్, శ్రీపర్వతాల్లో అలనాటి మేటి బౌద్ధ విహారాలు విద్యాకేంద్రాలై విలసిల్లాయి. నలంద, బుద్ధగయల్లో ఈ విహారాల స్వరూపాల్ని స్పష్టంగా చూడగలం. భారతీయ శిల్పకళ బౌద్ధులతోనే ప్రారంభమైంది. బుద్ధుడు మానవీయుడు,మహోన్నతుడు. దానం, శీలం, ప్రజ్ఞ, ఉపేక్ష, క్రాంతి, మైత్రి.. వంటి పది ఉత్తమ గుణాల్ని పరిపూర్తిగా సాధించిన మహామాన వుడు. భారత దేశంలో తప్ప మరెక్కడా కులం' లేదు. ఈ కులం అనే ఊసరవెల్లి వర్ణం అనే తొండగా ముదిరింది. ఇతర ప్రపంచంలో జాతి, రంగుల భేదాలతో మానవ సమాజాల విభజన ఉంది. అక్కడ ఆర్థికతేడాల్ని బట్టి కూడా విభజన ఉంది. ఐతే వర్గాల్లో గానీ, జాతి విభజనలో కానీ అంటరానితనంలేదు. ఇది భరతఖండంలోనే ఉంది. తెలుగు వారు తొలినుండి బౌద్ధంలో ప్రధానపాత్ర పోషించడం, బౌద్ధం బుద్ధుడు జీవించి ఉండగానే, బావరి అనే ముని, ఆయన శిష్యుల మూలంగా ఈ తెలుగుతీరానికి చేరింది. ఇలా ఎన్నో ఆసక్తికర అంశాలను, బౌద్ధం గురించిన వివరాలను 'తెలుగమ్మ ఒడిలో బౌద్ధం' పుస్తకం ద్వారా అందించిన బొర్రా గోవర్ధన్ అభినందనీయులు.

(తెలుగమ్మ ఒడిలో బౌద్ధం:బొర్రా గోవర్ధన్; వెల: రూ.80; ప్రతులకు: మంగళగిరి బుద్ధవిహారట్రస్టు, డోర్ నం.11-450/సి1, ఎన్‌సి.సి. రోడ్, మంగళగిరి-522503,గుంటూరుజిల్లా, ఆం.ప్ర.)

-తంగిరాల చక్రవర్తి

దురాశ ప్రేమకు చేటు!

కస్తూరి మురళీకృష్ణ

'ఇవోన్యాగ్గియా'

మనసునిండా ఆపేరు నింపుకొని పెదవులపై ఆపేరు పలుకుతూ అతడు నడుస్తున్నాడు. అతడి మనస్సులో పలురకాలు ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాడు.

అతడి భార్య అతడి ప్రాణం.

ఆమెను చూడగానే అతడికి ప్రపంచంలో ఆమె తప్ప మరెవరూ అవసరం లేదనిపించింది.

ఆమె తన పక్క ఉంటే ప్రపంచాన్ని సులభంగా జయించగలనన్న ధైర్యం కలిగిందతనికి.

దాంతో ఆమెని వివాహమాడతానన్నాడు. అందరినీ ఒప్పించాడు.

కానీ 'కాంబా' ప్రజలు పేదవారు. వారు అధికంగా వేటపై ఆధారపడి జీవిస్తారు. అంతవరకూ తమ పేదరికం అతడికి ఏమీ అనిపించలేదు. కానీ భార్య ఇంటికి వచ్చిన తరువాత అతడికి పేదరికం వదల్చుకోవాలన్న ఆలోచన కలిగింది.

తాము ఎందుకని పేదవారిగా ఉన్నారు? ఎందుకని దుర్భర దారిద్ర్యంలో జీవితం గడపాలన్న ఆలోచన వచ్చింది.

'మనం ధనం సంపాదించాలి. బోలెడన్ని సౌఖ్యాలు అనుభవించాలి. నువ్వు కష్టపడుతూంటే నేను చూడలేను' అన్నాడతడు భార్యతో.

'నీతో ఉంటే నాకు కష్టం తెలియటంలేదు. నేను కష్టపడుతున్నానని ఊహించి నువ్వు కష్టపడకు. మనవాళ్లందరూ ఎలా బతుకుతున్నారో మనం కూడా అలానే బతుకుతున్నాం' అంది.

కానీ అతడికి తమ పరిస్థితిని మెరుగుపరుచుకోవాలన్న కోరిక కలిగింది. అగ్నిలాంటి కోరిక రోజురోజుకూ అతడిని దగ్ధం చేయసాగింది.

'ఇతరులలా ఉండటం సామాన్యం. కానీ తన భార్య సామాన్యం కాదు. అసాధారణమైన వ్యక్తి. ఆమె అందరిలా జీవించటం కుదరదు. అందరికీ భిన్నమైన జీవితం ఇవ్వాలి ఆమెకి' అన్న కోరిక. అతడిని దహించివేయసాగింది.

తనకోరికను ఎలా తీర్చుకోవాలో అతడికి తెలియటంలేదు.

ఎందుకంటే, కీన్యాలో 'అకాంబాలుండే' ప్రాంతం అంతా అడవి. అక్కడ ఎలాంటి ప్రాకృతిక వనరులు లేవు, అడవి తప్ప.

ఈ సమయంలో అతడు ఓ పండుగ సందర్భంలో 'అకాంబా' తెగ సృష్టిగాథను విన్నాడు.

'ఆరంభంలో మూలుంగు (ఆఫ్రికన్ల దైవం) ఆడ, మగ మనుషులను సృజించాడు. వారు తిన్నగా స్వర్గం నుంచి భూమికి వచ్చారు. వారు 'నాయ్' అనే పెద్ద కొండ వద్ద దిగారు. అక్కడ ఇప్పటికీ వారి పాదాల ముద్రలు, దైవం వారికి ఇచ్చిన పశువుల కాలిముద్రలు చూడవచ్చు. అప్పుడు దైవం పెద్ద వర్షం కురిపించాడు. వర్షం పడటంతో వృక్షాలు మొలిచాయి. పలురకాల జీవాలు ఉద్భవించాయి. బోలెడన్ని చీమల పుట్టలు వెలిశాయి.

అలాంటి చీమల పుట్టలలోంచి ఒక అబ్బాయి, అమ్మాయి వెలికి వచ్చారు. కాలం గడిచింది. స్వర్గం నుంచి దిగి వచ్చిన ఆడమగలకు కేవలం మగసంతానం కలిగింది. చీమల పుట్టల్లోంచి వెలికి వచ్చిన వారికి అంతా 'ఆడ' సంతానం కలిగిది. దాంతో తమ కొడుకులను భూమిమీద చీమల పుట్టలోంచి వెలికి వచ్చిన వారి కూతుళ్లకు ఇచ్చి పెళ్లిళ్లు చేసేందుకు బోలెడంత పశుధనాన్ని కట్నం రూపంలో ఇవ్వాల్సి వచ్చింది.

దాంతోభూమిమీద వారంతా ధనికులయ్యారు. అపరిమతమైన ఐశ్వర్యం వారు భగవంతుడిని మరచిపోయేట్టు చేసింది. దాంతో వారు దైవాన్ని, సత్ప్రవర్తనను విస్మరించి ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించారు.

ఇది ములుంగుకు ఆగ్రహం కలిగించింది. వర్షాలు కురిపించటం మానేశాడు. దాంతో కరువుకాటకాలు విజృంభించాయి. ఈ పరిస్థితులలో అక్కడి ప్రజలు పొట్ట చేతపట్టుకుని వేర్వేరు ప్రాంతాలకు వెళ్లారు. అక్కడే స్థిరపడ్డారు. పలు తెగలుగా ఏర్పడ్డారు. కానీ తాము జన్మించిన ప్రాంతాన్ని వదిలినవారు 'అకాంబ' తెగలవారే. వారు ఎంతటి దుర్భర దారిద్ర్యాన్ని అయినా అనుభవిస్తున్నారు కానీ దైవం తమకు నిర్దేశించిన స్థలాన్ని వారు వదలటంలేదు'.

ఆ కథ విన్న తరువాత అతడికి ఓ ఆలోచన కలిగింది.

'దైవాన్ని మరచిపోవటం వల్ల, దైవం తమని పేదరికంలోకి నెట్టింది. ఆ దైవాన్ని ప్రార్థించటం వల్ల తిరిగి తను ధనవంతుడు కావచ్చు'.

'మన దైవం 'ఇవాన్యోగ్గియా' కదా. మూలుంగు అంటావేమిటి?' కథ చెప్పిన 'గ్రియోట'ను అడిగాడు.

'మూలుంగునే ఇవాన్యోన్గియా అంటారు'.

'ఇవాన్యోన్గియాను ఎలా కలవాలి? ఎలా మెప్పించాలి?'

'అది చాలా కష్టం. చాలా దూరం నడవాలి' అంటూ ఇవాన్యోన్గియాను మెప్పించే పద్ధతి చెప్పాడతడు.

అతడు చెప్పిన ప్రకారమే ఇవాన్యోన్గియా నామస్మరణ చేస్తూ అతడు చెప్పిన దిశగా నడుస్తూ వెళ్తున్నాడు అతడు.

ఇంతకీ అతడు ఐశ్వర్యం కోరేది తాను సుఖపడటం కోసం కాదు.

తాను ఐశ్వర్యాన్ని అనుభవించటం కోసం కాదు. తన భార్య కోసం.

స్వార్థం రాక్షసం. నిస్వార్థం దైవం.

ప్రేమ మనిషిలోని స్వార్థాన్ని నశింపజేసి, నిస్వార్థాన్ని పెంచుతుంది. అలాంటిదే అసలు ప్రేమ. అదే దైవం.

కాబట్టి దైవం తన కోరికను తీరుస్తుంది అన్న నమ్మకం అతడిలో రానురాను పెరుగుతోంది.

అలా నడుస్తూ నడుస్తూ ఎంతకాలం నడిచాడో మరచిపోయాడు అతడు. కాలం మరచిపోయాడు.

రాత్రి అవుతోంది. పగలు అవుతోంది.

అతడు నడుస్తూనే ఉన్నాడు. దైవధ్యానం చేస్తూనే ఉన్నాడు.

ఎండలు కాస్తున్నాయి. వర్షాలు పడుతున్నాయి. చలి వణికిస్తోంది.

నడుస్తున్నాడు. నడవలేనపుడు నిద్రిస్తున్నాడు. లేచి మళ్లీ నడుస్తున్నాడు.

దొరికింది తింటున్నాడు. కానీ దైవధ్యానం ఆపలేదు.

అలా ఎంతకాలం గడచిందో తెలియదు.

నడుస్తూ నడుస్తూన్న అతడికి కాలమే కాదు తాను నిద్రలో ఉన్నాడో, మేల్కొని ఉన్నాడో తెలియటంలేదు. అతనికి ప్రపంచమంతా దైవాధీనం, నడకలానే అనిపిస్తోంది.

అలా ధ్యానంచేస్తూ నడుస్తూన్న అతడు హఠాత్తుగా పడిపోయాడు.

పడిపోయానన్న స్పృహ కూడా లేదు అతడికి. అతడి మనస్సు దైవధ్యానం చేస్తూనే ఉంది. కాళ్లు కదలుతూనే ఉన్నాయి.

ఇంతలో ఎదురుగా చల్లటి నీరు పారే నది కనిపించింది.

తాను నీటిదగ్గరకు వెళ్లాడో, నీరు తన దగ్గరకు వచ్చిందో తెలియదు.

చల్లటి నీరు ముఖానికి తాకింది.

ఒక చల్లటి స్వరం 'బాబూ..ఇంత కష్టం దేనికి? ఐశ్వర్యం కోసమా?' అని వినిపించింది.

కళ్లు తెరచి చూశాడు.

సూర్యుడు ధగధగలాడుతున్నాడు. సూర్యకిరణాలు నీటిపై ప్రతిఫలించటంతో ఆ ప్రాంతం అంతా వెలుగుతో నిండిపోయంది.

అతడి కంటినిండా వెలుగు నిండిపోయింది.

'అవును..నా భార్య సుఖపడాలి. కష్టపడటం నేను చూడలేను' అన్నాడతడు.

'ఒక వ్యక్తి పైనే కేంద్రీకృతమయిన ప్రేమ పరిమితమైన ప్రేమ. అది సంపూర్ణమైన ప్రేమ కాదు. సంకుచితం. విశ్వమానవాళిపైకి నీ ప్రేమ విస్తరించు. సకల చరాచర సృష్టి పైకి నీ ప్రేమను విస్తరించు. అది అసలు ప్రేమ..అదే అసలైన ఐశ్వర్యం.

ఆమాటలు అతడికి అర్థంకాలేదు. 'నాకు ఐశ్వర్యం కావాలి. నా భార్య కష్టపడకూడదు.'

'సరే. నీకు బోలెడన్ని పశు సంపదలిస్తాను'.

'ఒద్దు. నాకు దయ ఒద్దు. నేను ధనవంతుడిని అయ్యే రహస్యం కావాలి'.

వెలుగురేకలు నవ్వినట్టు తోచింది. 'ఇదిగో..ఈ లేహ్యాం తీసుకువెళ్లు. నీ భార్య దంతాలపై రాయి..ధనవంతుడవవుతావు. కానీ..సంకుచితమైన ప్రేమ ఫలితం ఎప్పుడూ సవ్యంగా ఉండదు'.

అతడి దృష్టి భగవంతుడు ఇచ్చిన లేహ్యాంపైనే ఉంది. కానీ భగవంతుడి మాటలను అతడు సరిగ్గా వినలేదు. అర్థం చేసుకోలేదు. దాని ఫలితం అతడి ఊహకు అందలేదు.

****

చాలాకాలం తరువాత ఇంటికి వచ్చిన భర్తను చూసి అతడి భార్య సంతోషించింది. అతడు చెప్పినట్టే దంతాలపై లేహ్యాం రాసుకుంది.

'ఇందువల్ల ధనం లభిస్తుందా?' ఆశ్చర్యంగా అడిగింది.

కొన్నాళ్లకి ఆమెకు రెండువైపుల దంతాలు పెరగటం ఆరంభమయింది.

అవి విపరీతంగా పెరగడంతో బలవంతాన వాటిని

...'ఇదిగో..ఈ లేహ్యాం తీసుకువెళ్లు. నీ భార్య దంతాలపై రాయి..ధనవంతుడవవుతావు. కానీ..సంకుచితమైన ప్రేమ ఫలితం ఎప్పుడూ సవ్యంగా ఉండదు"....

విరవాల్సి వచ్చింది.

చాలా బాధపడిందామె.

కానీ ఆ దంతాలను కొనటానికి ఎందరో పోటీపడ్డారు. బోలెడంత ధనం వచ్చింది.

ఆ ప్రాంతంలోని వారిద్దరూ ఐశ్వర్యవంతులయ్యారు.

కొన్నాళ్లకు మళ్లీ లేహ్యాం రాశాడు. మళ్లీ దంతాలు పెరిగాయి. మళ్లీ వాటిని విరిచారు. బోలెడంత ధనం మళ్లీ లభించింది.

కానీ దంతాలు పెరగటం, వాటిని విరవటం ఆమెకు బాధాకరంగా ఉంది.

అంతేకాదు, ఆమె ప్రమేయం లేకుండా ఆమె శరీరం విపరీతంగా పెరిగిపోసాగింది.

ఆమె చర్మం గట్టిపడసాగింది.

'నాకు ఐశ్వర్యం ఉన్నప్పటికన్నా లేనప్పుడే బాగుంది. నువ్వు నన్ను సుఖపెడుతున్నావో, కష్టపెడుతున్నావో నాకు తెలియటంలేదు' శరీరం భారమైపోగా అతికష్టంమీద అందామె.

'నీ కోసమే ఈ డబ్బంతా. ఈ ఐశ్వర్యమంతా' మరోసారి లేహ్యాం పూస్తూ అన్నాడతడు.

'నాకు దంతాలు పెరుగుతున్నా, విరుగుతున్నా విపరీతమైన బాధ కలుగుతోంది. దంతాలు పెరగటమంటేనే భయంగా ఉంది' అందామె.

'ఇప్పుడు ఐశ్వర్యం నీ కడుపులో ఉన్న మన సంతానం కోసం' అన్నాడతడు ఆమెని అనునయిస్తూ.

అతడు తనను సుఖపెట్టటంకోసం ఐశ్వర్యం సంపాదించాలను కున్నాడు. కానీ ఇప్పుడు ఐశ్వర్యం కోసం తన కష్టాన్ని గమనించటం లేదు.

ఆమెలో ఆవేదన పెరిగింది. దంతాలు పెరిగి విరగొట్టాల్సిన రోజులు దగ్గర పడుతూంటే ఆమెకు భయం పెరిగిపోయిది. దీనికి తోడు ఆమె శరీరం సంపూర్ణంగా రూపాంతరం చెందుతోంది.

ఇక తెల్లారితే దంతాలు విరగ్గొడతారనగా ఆమె ఒక నిశ్చయానికి వచ్చింది.

అర్ధరాత్రి ఇల్లు వదలి అడవిలోకి పారిపోయింది.

****

తెల్లారి లేచి భార్య కనబడకపోవడంతో అతడు పిచ్చివాడిలా ఆమెకోసం వెతికాడు. ఏడ్చాడు. తన పొరపాటు గ్రహించాడు.

తనకు ఐశ్వర్యం వద్దు, ఆమెనే కావాలని దైవాన్ని ప్రార్థించాడు.

అలా ప్రార్థిస్తూ వెళ్తున్న అతడి దారికి అడ్డుగా పర్వతాకారం కల జీవి వచ్చి నిలబడింది. దానికి తొండం ఉంది. తొండానికి ఇరువైపుల దంతాలు పొడుచుకు వచ్చి ఉన్నాయి.

దంతాల ద్వారా ఆమెని గుర్తుపట్టాడు.

'ప్రియా' అన్నాడు.

'ప్రియతమా' అంది.

అప్పుడు అర్థమయిది అతడికి సంకుచిత ప్రేమ వల్ల కలిగే అనర్థం. కానీ అప్పటికే ఆమె ఏనుగులా మారిపోయింది. ఆమె సంతానం కూడా ఏనుగులే అయ్యాయి. అతడు కూడా అప్పటినుంచీ అడవిలో ఏనుగులతో ఉండసాగాడు.

****

ఆఫ్రికా తెగలలో ఏనుగును దైవంలా భావిస్తారు. అన్ని జంతువులలోకీ మనిషికి అతి సన్నిహితమైన జంతువుగా ఏనుగును భావిస్తారు. అయితే స్వార్థపరులు ఇప్పటికీ ఏనుగుదంతాల ద్వారా ఐశ్వర్యం సాధించాలని ప్రయత్నిస్తూనే ఉన్నారు, సంకుచిత ప్రేమలోని వికృత రూపుకు నిదర్శనంగా.

పదాన్వేషణ-19

నిర్వహణ
గుల్ మహమ్మద్ నాయక్

1	2	3	4	5	6
R,A	B,E	C,L	S,W	M,N	D,P

పిల్లలూ! కింది ఆధారాలకు ఎదురుగా ఉన్న అంకెలను చూడండి. ఆ అంకెలతో సంబంధం ఉన్న పై గళ్లలోని రెండు అక్షరాలతో ఆధారానికి తగిన జవాబును రెండు ఆంగ్ల పదాలతో రాయండి.

ఉదా:ఆధారం: డబ్బులు పెట్టుకునే చిన్న సంచి-5,6

అంటే 5వ గడిలోంచి ఒక అక్షరం, 6వ గడిలోంచి ఒక అక్షరం తీసుకుని జవాబు రాయాలి.

జవాబు: 5వ గడిలోంచి 'M', 6వ గడిలోంచి 'P' తీసుకుని 'MONEY PURSE' అని జవాబు రాయాలి.

ఆధారాలు:

1. ఇదో నడకట.-3,4.........
2. తరగతి గదిలో యిది ముఖ్యమైంది. - 2,2 ....
3. నృత్య శిక్షకుడు. -6,5 ....
4. ఉత్తర ధ్రువము - 5,6 ....
5. దీనిలో బట్టలు శుభ్రపడతాయి. -4,5........

దారి చూపుతారా



ఇద్దరు సేవకులు

కథ

చిత్రవర్మ మహారాజుది సేవకులను రాచిరంపాన పెట్టే స్వభావం. ఏ చిన్న తప్పు చేసినా 'ఏం జరుగుతుందో?' అని సేవకులు నిరంతరం కంగారుపడేవారు.

ఒకసారి చిత్రవర్మ తన పరివారంతో వేటకు వెళ్లాడు. అడవిలో గుడారాలు వేసి రాజావారు బసచేశారు. నరేంద్ర, సురేంద్ర అనే ఇద్దరు ఆంతరంగిక రక్షకభటులు చిత్రవర్మను కంటికి రెప్పలా కాపాడేవారు.

ఐతే నరేంద్ర, రాజుగారి మెప్పుకోసం పనిచేసేవాడు. అవకాశం దొరికితేచాలు తన పొగడ్తలతో చిత్రవర్మను ఆకాశానికి ఎత్తేసేవాడు. సురేంద్ర నిజాయితీగా పనిచేసేవాడు. ముఖస్తుతిమాటలు మాట్లాడేవాడు కాదు.

ఒకసారి వేటకు వెళ్లిన చిత్రవర్మ అడవిలో బసచేశాడు. అంతలో పెద్ద వర్షం వచ్చింది. సేవకులు ఉన్నంతలో వంట చేశారు. ఆకలితో ఉన్న సురేంద్ర ఒక పళ్లెం తీసుకుని కొద్దిగా అన్నం, కూరలు వేసుకుని తినడం ప్రారంభించాడు.

అది చూసిన నరేంద్ర నీకు ఎంతధైర్యం, మహారాజు తినకుండానే అన్నం తింటావా?' ప్రశ్నించాడు.

మిత్రమా! రెండురోజుల నుండి నేను ఉపవాసం ఉన్నాను. నాకు చాలా ఆకలిగా

ఉంది. నీరసంతో కళ్లు తిరుగుతున్నాయి. మహారాజు ఎప్పుడు నిద్రలేస్తారో తెలియదు. అందువల్ల నేను రెండుముద్దలు తింటున్నాను. నా తప్పును మన్నించు' అని నిజాయితీగా ప్రాధేయపడ్డాడు సురేంద్ర.

అయితే నరేంద్రమాత్రం ససేమిరా అన్నాడు. ఇంతలో మహారాజావారు నిద్ర లేచారు.

సురేంద్రపై చాడీలు చెప్పి ఇరికించడానికి ఇదే మంచి అవకాశమని నరేంద్ర భావించాడు. మహారాజా! మీరు నిద్రలేచిన తరువాత భోజనం చేద్దామని నేను ఎంత వారించినప్పటికీ నా మాట వినకుండా సురేంద్ర తింటున్నాడు' అని చాడీలు చెప్పాడు.

రాజుగారికి విపరీతమైన కోపం వచ్చింది. 'ఈ తప్పుకు శిక్ష ఏమిటో తెలుసా?' అని ఉగ్రరూపంతో చిత్రవర్మ ప్రశ్నించాడు.

ఈ అపాయం నుండి ఎలా బయట పడాలా అని సురేంద్ర ఆలోచించాడు. క్షణంలో ఒక మెరుపులాంటి ఆలోచన వచ్చింది. వెంటనే మహారాజా! నేను మిమ్మల్ని అవమానించాలని తినలేదు. మీ ఆహారంలో ఎవరైనా విషప్రయోగం చేశారేమోనని నాకు అనుమానం వచ్చింది. అందువల్ల పరీక్షించేందుకు నేను ముందుగా తిన్నాను. ప్రజారక్షకులైన మీరు పదికాలాలపాటు చల్లగా ఉండాలనేది నా ఆకాంక్ష. మీరు తినే ఆహారంలో ఏదైనా విషప్రయోగం జరిగితే ముందుగా నేను తినడం వల్ల మిమ్మల్ని రక్షించినవాడినవుతాను. నేను చనిపోయినా రాజ్యానికి వచ్చే

వార్త ఆదివారం

నష్టమేమీలేదు' అన్నాడు.

సురేంద్ర స్వామిభక్తికి మహారాజు కళ్లల్లో ఆనందభాష్పాలు వచ్చాయి. 'సురేంద్రా! నీ స్వామిభక్తికి మెచ్చి ఈ రెండు వజ్రాలహారాలను నీకు బహూకరిస్తున్నాను' అన్నాడు.

తాను అనుకున్నట్లు కాకుండా, కథ అడ్డం తిరగడంతో నరేంద్ర ఖంగుతిన్నాడు.

ఆ తర్వాత మిత్రులిద్దరూ గుడారం బైటకు వచ్చారు. మిత్రమా! నేను ఆకలితో ఉన్నానని చెప్పినా నువ్వు నాకు హాని చేయాలని భావించావు. ఇలాంటి పనులవల్ల తాత్కాలికంగా లబ్ధి పొందవచ్చేమోగాని శాశ్వతంగా మంచిపేరు సంపాదించుకోలేవు. ఇకపై ఇలాంటి పనులు చేయకుండా నిజాయితీతో, నమ్మకంతో మంచిపేరు తెచ్చుకోవడానికి ప్రయత్నించు. మహారాజు నాకు ఇచ్చిన రెండు వజ్రాల హారాల్లో నీకు ఒకటి ఇస్తున్నాను. తీసుకో అని హారం ఇచ్చాడు.

నరేంద్రుడు తన తప్పును తెలుసుకున్నాడు. తాను కీడు చేయబోయినా మంచి మనసుతో మన్నించడమేగాక, బహుమతిలో భాగం కూడా ఇచ్చిన సురేంద్రకు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. ఆ తర్వాత నరేంద్రుడు కూడా నిజాయితీపరుడిగా మారిపోయాడు.

–షేక్ అబ్దుల్ హాకీం జాని
తెనాలి.

పదాన్వేషణ జవాబు

1.CAT WALK
2.BLACK BOARD
3.DANCE MASTER
4.NORTH POLE
5.WASHING MACHINE

హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

గిరీష్ అంకుల్ సమాధానాలు

ఎ.ప్రదీప్‌కుమార్, గుంటూరు.

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నేను ఏడో తరగతి చదువుతున్నాను. గబ్బిలాల ప్రత్యేకత ఏమిటి? వీటి వల్ల ఏమైనా ప్రయోజనం ఉందా? దయచేసి వివరించండి.

జవాబు: ప్రదీప్‌కుమార్! ఎగురగలిగిన క్షీరదం గబ్బిలం ఒక్కటే. ఇది పక్షికాదు. ఇవి గుడ్లుపెట్టవు. పిల్లల్ని కంటాయి. మనిషిలాగా వీటికి పళ్లు, చెవులు ఉంటాయి. పక్షిరెక్కలకు, గబ్బిలం రెక్కలకు తేడా ఉంటుంది. దీని రెక్కలకు ఈకలుండవు. గబ్బిలం రెక్క సాగే గుణంగల చర్మంతో గొడుగు బట్ట లాగా ఉంటుంది. గబ్బిలాలకు కాళ్లున్నా భూమ్మీద నడిచేశక్తి వాటికిలేదు. అంతేకాదు తలకిందులుగా వేలాడటం వీటి ప్రత్యేకత. గబ్బిలాలలో రకాలున్నాయి. అమెరికా ఖండంలో జీవించే వాంపైర్ జాతికి చెందిన గబ్బిలాలు జంతువుల రక్తాన్ని తాగుతాయి. మలేషియా, ఇండోనేషియాలలో జీవించే కలోంగ్ అనే గబ్బిలం రెక్క అయిదున్నర అడుగుల పొడవుంటుంది. థాయ్‌లండ్‌లోని కొన్ని గబ్బిలాలు కొన్ని సెం.మీ.లకు మించి ఉండవు. కొన్ని గబ్బిలాలు చెట్ల కొమ్మలకు, రెమ్మలకు వేలాడుతూ ఉంటాయి. ఉష్ణమండలంలోని కొన్ని గబ్బిలాలు చిన్న గూళ్లను నిర్మించుకొని అందులో ఉంటాయి. ఈజిప్టులో పిరమిడ్లలోను, ఆస్ట్రేలియాలో చెట్లలోనూ, ఉత్తర అమెరికా, యూరప్‌లలో ఇళ్లలోనూ నివాసముంటాయి. కీటకాలను, పళ్లను, చేపల్ని, మాంసాన్ని, పూల మకరందాన్ని గ్రోలే రకరకాల గబ్బిలాలున్నాయి. మనదేశంలోని ఒక రకం గబ్బిలాలు ఎలుకల్ని, పక్షుల్ని, బల్లుల్ని కూడా తినేస్తాయి. ఇక వీటి వల్ల ప్రయోజనం గురించి చెప్పాలంటే.. వాణిజ్యపరంగాను, పర్యావరణపరంగాను ప్రయోజనకరమైన వందల కొద్ది వృక్షజాతుల్ని గబ్బిలాలు సంరక్షిస్తున్నాయి. సుమారు రెండువందలకు పైగా గబ్బిలాల జాతులు అడవుల్లో కొన్ని వృక్షాల సంరక్షణ చేపట్టాయి. ఖర్జూరం, అడవి అరటి, జీడి, మామిడి, ఈత, అత్తి వంటి వృక్షాల అభివృద్ధికి గబ్బిలాలే కారణం. ఈ వృక్ష జాతుల వల్ల మానవాళికి కావలసిన మందులు, పండ్లు, పానీయాలు, కలప మరెన్నో లభిస్తున్నాయి.

వి.అనిత, హైదరాబాద్.

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నేను ఎనిమిదో తరగతి చదువుతున్నాను. సాధారణంగా మనిషి రోజుకు ఎంత గాలి పీలుస్తాడు? దయచేసి చెప్పండి.

జవాబు: అనితా! నీకు భలే సందేహం వచ్చింది. ఒకవ్యక్తి రోజుకు 24 కేజీల గాలిని పీలుస్తాడు.

జైలు గోడలు కళాఖండాలుగా..

తెలిసో, తెలియకో నేరాలు చేసి, జైలు పాలయి, ఖైదీలుగా మనోవ్యథతో కుమిలిపోయే వారెంతోమంది. అయితే వారిని అనవసరపు ఆలోచనలనుంచి, నిరాశ, నిస్పృహలనుంచి తప్పించి, విడుదలయ్యాక సమాజంలో పునరావాసం పొందేందుకు వీలుగా ఖైదీలకు వృత్తిపరమైన, సృజనాత్మకమైన పనులలో తర్ఫీదునివ్వటం ఎంతైనా అవసరం. ఇటీవల ఢిల్లీలోని కొందరు కళాకారులతో కలిసి తీహార్ జైల్లోని ఖైదీలు వారి కొత్త జైలు భవనం మండోలి జైలు నం.14కు స్వయంగా పెయింట్ వేశారు.

మండోలి జైలు భవనం తూర్పు ఢిల్లీలో 68.4 ఎకరాల విస్తీర్ణంలో నిర్మింతమైంది. ఇందులో 3,000మంది ఖైదీలకు వసతి ఏర్పాటైంది.

ముందుగా 500మంది ఖైదీలు అక్కడికి చేరారు. వారు, కళాకారులతో కలిసి ఎంచక్కని చిత్రాలతో జైలు గోడల్ని అందంగా తీర్చిదిద్దారు.

ఢిల్లీ స్ట్రీట్ ఆర్ట్ (డిఎస్ఎ) బృందం ఆ జైలు భవనం వెలుపలి గోడలపై సృజనాత్మక డిజైన్లను రూపొందించారు. వారు ఢిల్లీ జైళ్ల డైరెక్టర్ జనరల్‌ను కలిసి ఆ డిజైన్ల గురించి చర్చించారు. గిరిజన చిత్రరీతుల్ని డిజైన్లలో వాడటం ఆయనకు ఎంతగానో నచ్చింది.

వృక్ష జీవితం, జంతువులు, పక్షులు, ఫలాలు, పుష్పాలు మొదలైన ప్రాకృతిక దృశ్యాలనే గోడలపై చిత్రీకరించారు. 300 అడుగుల పొడవున్న జైలు గోడలపై కొన్ని అందమైన జింకలను చిత్రించారు. ప్రధాన ప్రవేశద్వారంపై ముచ్చటైన నెమలి చిత్రం చక్కగా అమరింది.

భద్రత దృష్ట్యా ఖైదీలు జైలు లోపలి గోడలపై చిత్రాల రచనలోనే డిఎస్ఎతో కలిసి పనిచేశారు. ప్రవేశద్వార గోడలపై మధుబని చిత్రకళను ఉపయోగించారు. వృక్షజీవితాన్ని జైలు బయటనుండి లోపలివైపుకు, ఆపైన భవనంలోని ఇతర గోడలకు విస్తరింపజేశారు.

దాదాపు 12,000 చ.అడుగుల విస్తీర్ణాన్ని ఈ వృక్షజీవిత చిత్రం నింపేసింది. డిఎస్ఎ బృందంలో 15మంది చిత్రకారులున్నారు. వారితో ఉత్సాహవంతులైన ఖైదీలు కొందరు కలిసి పనిచేశారు. ఈ చిత్రరచన పూర్తికావటానికి 8 వారాల కాలం పట్టింది. అయితే ఖైదీలకు చిత్రరచన తొలిసారి కావటం, అందునా ఇంత పెద్ద ఎత్తులో చిత్రించటం.. వారికి కొంత కష్టమే అయింది. అయినా డిఎస్ఎ అడుగడుగునా పర్యవేక్షిస్తూ, సలహాలిస్తూ, ముఖ్యమైన చోట్ల తామే పూనుకుంటూ పని ముగించారు.

ఇండియాలోనే మాండొలి జైలుని అందమైన జైలుగా తీర్చిదిద్దాలన్నది తమ అభిమతమని జైళ్ల డిజి యాదవ్ అన్నారు. ఈ పనుల వల్ల ఖైదీలకు సానుకూల (పాజిటివ్) అనుభవం కలగడమే కాకుండా వారి నైపుణ్యాలకు పదును పెట్టుకుని, ఉత్తమ పౌరులుగా రూపొందేందుకు వీలేర్పడుతుందని అన్నారు. త్వరలో జైలు శిక్షను ముగించుకుని జైలునుంచి విడుదలయ్యేవారికి సైతం ఇదొక ఉత్సాహాన్నిచ్చి, వారి జీవితాలను తీర్చిదిద్దుకోవటానికి తోడ్పడుతుంది.

ఆనందోత్సవ కేళి..

నేడు హోలీ

భారత్‌ను 'పండుగల దేశం' అనటంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. ఎందుకంటే భారత్‌లో జరుపుకునేన్ని పండుగలు మరెక్కడా ఉండవు. ఆ పండుగల్లో కూడా ఎంతో వైవిధ్యం! అలాటి వైవిధ్యానికి మచ్చుతునక 'హోలీ'.. ఈ పండుగలో రంగులదే ప్రాధాన్యత కాబట్టి 'రంగుల పండుగ' అని కూడా పిలుచుకుంటారు.

హోలీ జరుపుకోవడానికి నేపథ్యంగా ఓ పౌరాణిక గాథ ఉంది. పురాణాల ప్రకారం హిరణ్యకశిపుడి సోదరి హోలికను చంపిన అనంతరం ఆనందోత్సాహాలతో పండుగ చేసుకోగా, అప్పట్నుంచి ఏటా ఈరోజున హోలీ జరుపుకునే సంప్రదాయం ఏర్పడిందని చెపుతారు. ప్రహ్లాదుడు, తండ్రి హిరణ్యకశిపుడి ఆదేశాలను ధిక్కరించి విష్ణువునే ప్రార్థిస్తూ ఉండటంతో హిరణ్యకశిపుడు, తన సోదరి హోలిక సహాయంతో అతణ్ని చంపటానికి ప్రయత్నిస్తాడు. అగ్ని తనను ఏమీచేయలేదని తెలిసిన హోలిక ప్రహ్లాదుణ్ని తన ఒడిలో ఉంచుకుని మంటల్లో కూర్చుంటుంది. అయితే చిత్రంగా హోలికే మంటలకు ఆహుతవుతుంది. ప్రహ్లాదుడు క్షేమంగా ఉంటాడు. ఆవిధంగా హోలీ ముందురోజు హోలికా దహనం చేస్తారు.

అలాగే కృష్ణుడిపట్ల రాధకు గల అజరామర ప్రేమకు గుర్తుగా కూడా ఈ పండుగ చేసుకుంటారు. మరో పౌరాణిక గాధ ప్రకారం శివుడు, కాముణ్ని (మన్మథుణ్ని) దహింపజేశాక, అతడి భార్య రతీదేవి ప్రార్థనపై తిరిగి మన్మథుడిని సజీవుణ్ని చేస్తాడు. ఆ రోజుకు గుర్తుగా ఈ పండుగ జరుపుకుంటున్నట్లు ఒక కథనం.

భారత్‌లో వేర్వేరు ప్రాంతాలలో వేర్వేరు రకాలుగా హోలీ పండుగ జరుపుకుంటారు. ముఖ్యంగా మధురలో హోలీ పండుగ భారీ ఎత్తున 16 రోజుల పాటు చేస్తారు. మధురలో హోలీ పండుగకు మరో పౌరాణిక నేపథ్యం కూడా ఉంది. చిన్నికృష్ణుణ్ని చంపటానికి కంసుడు, పూతనను పంపగా రాక్షసి పూతన చిన్నికృష్ణుడికి విషపూరితమైన పాలు ఇస్తుంది. కృష్ణుడికి అంతా తెలుసుకనుక, పాలుతాగుతున్నట్లు నటించి పూతన ప్రాణాలనే హరిస్తాడు. దాంతో గోపాలురు ఎంతో ఆనందిస్తారు. పూతన దిష్టిబొమ్మను తయారుచేసి దహనం చేస్తారు. ఇప్పటికీ మధురలో ఈ ఆచారాన్ని పాటిస్తారు.

భారత్‌లోని ఉత్తర, పశ్చిమ, తూర్పు ప్రాంతాలలో హోలీని గోపికాకృష్ణుల రాసలీలగా ఆనందోత్సవాలతో జరుపుకుంటారు. దీన్నే ఫగ్ అంటారు. మోడులు చిగురులు తొడుగుతూ, ఆశకు, ఉత్సాహానికి ప్రతీకగా ఉండే ప్రకృతి, హోలీకి చక్కటి నేపథ్యంగా ఉంటుంది. ముఖ్యంగా బర్సాన, నంద్‌గావ్‌లలో లాఠ్‌మార్ హోలీ విశేషంగా జరుపుకుంటారు. సంగీత నృత్యాలు, పరస్పరం రంగులతో అభినందనలు తెలుపుకోవడాలు అంతా ఆనంద కోలాహలమే. ఆ తర్వాత స్వీట్లు తినడం పరిపాటి. హోలీకి ముఖ్యంగా 'గుజియా' అనే ప్రత్యేకరకం స్వీట్‌ను తింటారు.

రంగుల పొడులు ముఖ్యంగా అబీర్ లేదా గులాల్ చల్లుకుంటారు. రంగుల నీళ్లను పిచికారీలతో, బెలూన్లతో పరస్పరం చిమ్ముకుంటారు. పెద్దలు పిల్లల ఫాలభాగంపై అబీర్‌ను దిద్ది ఆశీర్వదిస్తే, పిల్లలు పెద్దల పాదాలకు గులాల్ పూస్తారు.

పంజాబ్‌లోని ఆనంద్‌పూర్ సాహిబ్‌లో సిక్కులు హోలీ మర్నాడు హోలా మొహల్లాను జరుపుకుంటారు. ఈ సందర్భంలో వారు ప్రాచీన మార్షల్ ఆర్ట్స్‌ను, మాక్ బ్యాటిల్స్‌ను నిర్వహిస్తారు.

అయితే ఆనందోత్సాహాలతో రంగులు చల్లుకోవటం సరదాగానే ఉంటుంది కానీ సింథటిక్ రంగుల వాడకం వల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతాయి. అందుకే సహజసిద్ధ రంగుల్నే వాడుకోవడం మంచిది. రంగులతో ఆడేటప్పుడు సైతం జాగ్రత్తగా ఉండాలి. ఇష్టం వచ్చినట్లు కళ్లల్లో పడేట్లుగా రంగుల్ని చల్లకూడదు. అలాగే సునేరిని ముఖానికి పూసుకోవటం చాలా ప్రమాదకరం.

అలాగే ఆడేందుకు సిద్ధంగా ఉన్నవారితోనే ఆడాలి కానీ రోడ్డుమీద పోయే వారిపై ఇష్టం వచ్చినట్లు రంగులు పోయడం కూడదు. సహజసిద్ధమైన రంగులతో పరిమిత సమయం ఆడి వెంటనే పూర్తిగా కడిగేసుకోవటం క్షేమకరం. అలాకాక రసాయనిక రంగులతో వినోదంపేరిట విపరీతంగా ప్రవర్తిస్తే ఆనందం కాస్తా విషాదంగా మారిపోతుంది. అందుకే హద్దుల్లోనే హాయిగా హోలీ ఆడుతారుగా!

కథ

"డాడీ, నిన్న క్లాసులో ఫీజు కట్టనివాళ్ల పేర్లు అనౌన్స్ చేసారు. తొందరగా కట్టకపోతే క్లాసులో కూర్చోనివ్వరట".

తనకి క్లాసులో జరిగిన అవమానం కంటే నాన్నని ఇబ్బంది పెడుతున్నాననే బాధే ఎక్కువగా కనబడుతోంది, నా కూతురు గొంతులో.

వానప్రస్థం

- ఉమా మహేష్ ఆచాళ్ళ

"సారీ తల్లీ! ఈ రోజు, రేపట్లో తప్పకుండా కట్టేస్తాను" చదువుతున్న పేపర్ మడిచి పక్కన పెడుతూ మొహంలో నవ్వు అరువు తెచ్చుకుని చెప్పాను. అది నాకు బాగా అలవాటైన పని కదా. నవ్వు కాదు అరువు. కొన్ని పనులు చెప్పడమూ, చేయడమూ రెండూ కష్టమే. నేను ఓ ప్రభుత్వ ఆఫీసులో చిరు ఉద్యోగిని. పెద్దగా చదువుకోలేదు. టెంపరరీ బేసిస్ మీద జాయిన్ అయ్యి, నెమ్మదిగా పెర్మనెంట్ అయ్యాను. పట్నంలో కాపురం కావడంతో పేరుకి ప్రభుత్వ ఉద్యోగమయినా, ఇంటద్దెలూ, పిల్లల ఫీజులూ, ఇతర పట్నవాసం ఖర్చులతో ఏ నెలకానెల నెట్టుకొస్తున్నాను. ఊర్లో నా వాటాకి రెండెకరాల పొలం ఉన్నా, అది నాన్న తర్వాతే నా చేతికి వస్తుంది. అన్ని ఇబ్బందుల్లోనూ నాకు ఒకే ఒక ఓదార్పు నాన్న. అమ్మ పోయిన తర్వాత నాన్న ఆరు నెలలు ఊర్లో అన్నయ్య దగ్గరా, ఆరు నెలలు నా దగ్గరా ఉంటున్నారు. ఆ ఆరు నెలలూ అతని పెన్షన్ మొత్తం ఎవరి దగ్గర ఉంటే, వాళ్లకి ఇచ్చేస్తారు. ప్రస్తుతం నాన్న అన్నయ్య దగ్గర ఉంటున్నారు. అందుకే ఈ ఇబ్బంది. ప్రతీ నెలా ఇదే తంతు. ఆఫీసులో ఎవరో ఒకరి దగ్గర వడ్డీకి అప్పు తేవటం, ఆ వడ్డీలు కట్టలేక మళ్లీ అప్పు చేయడం. నాన్న వచ్చిన ఆరు నెలలే కొంచెం తెరిపి. నా భార్య కూడా నాన్నని బాగా చూసుకుంటుంది. డబ్బు ఇస్తున్నారని కాదుగానీ, నాన్నని నచ్చనివాళ్లు ఎవరూ ఉండరు. డెబ్బై ఏళ్ల వయసులో కూడా ఎంతో ఆరోగ్యంగా, వ్యక్తిగత క్రమశిక్షణతో ఉంటారు. ఎప్పుడూ ఖాళీ కూర్చోరు. ఉదయం పిల్లల్ని లేపడం మొదలు- వాళ్లని తయారుచేయడం, బేషజాలకు పోకుండా, కోడలికి వంటలో కూరలు తరిగి ఇవ్వడం, పిల్లల్ని వీధి చివర ఆటోవరకూ దింపడం- ఇలా ఒక్క క్షణం కూర్చోకుండా ఏదో ఒక పని చేస్తూనే ఉంటారు. రాత్రి పిల్లలచేత హోమ్ వర్క్ చేయించి, వాళ్లకి మంచి కథలు చెప్పి పడుకోబెట్టడంతో పూర్తవుతుంది అతని దినచర్య.



ఇవన్నీ ఒక ఎత్తు, అతని నెలసరి పెన్షన్ ఒక ఎత్తు. మొత్తం పెన్షన్ అంతా కోడలికి ఇచ్చేస్తారు. అనుకోడానికి కొంచెం కటువుగానే ఉన్నా, బహుశా, ఇంత ఉత్పాదకత ఉండబట్టేనేమో అతను కొడుకుల దగ్గర అంత ప్రశాంతంగా ఉండగలుగుతున్నారు. నాన్న టీచర్‌గా చేసి రిటైర్ అయ్యారు. అన్నయ్య తండ్రి నీడలో క్రమశిక్షణలో పెరిగి అదే ఊళ్లో టీచర్ ఉద్యోగం సంపాదించాడు. నేను మాత్రం చిన్నప్పటినుంచి బాబాయ్ ఇంట్లో ఎక్కువగా పెరిగాను.

వర్తమానంలోకి వస్తే- కూతుర్ని ఆటో ఎక్కించి, ఇంటికి వచ్చి, అప్పు చేయడానికి ఎవరు మిగిలారా? అని ఆలోచించడం మొదలు పెట్టా. తెలిసున్నవాళ్ల అందరి దగ్గరా నా క్రెడిట్ లిమిట్ అయిపోయింది. అన్ని ప్రభుత్వ ఆఫీసుల్లో లాగానే మా ఆఫీసులో కూడా వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతుంది.

అవసరానికి తీసుకునేవాళ్లూ, వ్యసనాలకు తీసుకునేవాళ్లూ, తిరిగి ఎక్కువ వడ్డీకి అప్పు ఇవ్వటానికి తీసుకునేవాళ్లు- ఇలా అన్ని రకాలవాళ్లు ఉంటారు. ఇచ్చేవాళ్లూ అంత మంది ఉంటారు. మనం ఏ గ్రూప్‌లో ఉండాలనేది మనమే నిర్ణయించుకోవాలి. నాకెందుకో ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం నేను కూడా అప్పులు ఇచ్చే గ్రూప్‌లోకి మారితేనే తీరతాయనిపిస్తోంది. దీనికి కొంత పెట్టుబడి కావాలి. ఈసారి నాన్న వచ్చినపుడు పొలం తాకట్టు పెట్టి కొంత క్రాప్ లోన్ తీసుకోమని చెప్పాలి. ఆ డబ్బుతో వడ్డీ వ్యాపారం చేస్తే కానీ తన కష్టాలు గట్టెక్కేలా లేవు. నా ఆలోచనలకి అడ్డు తగులుతూ కాలింగ్ బెల్లు మోగింది. పాలవాడు అయిఉంటాడు డబ్బులు తర్వాత ఇస్తానని ఎలా చెప్పాలా? అని ఆలోచిస్తూ తలుపు తీసాను.

ఎదురుగా చేతిసంచి నిండా కూరగాయలు, తేగలు, జున్ను క్యారేజ్‌తో నాన్న. ఒక్కసారిగా మండుటెండలో కుండపోతగా వాన కురిసినట్టయింది, నాకు.

"రండి నాన్నా!" అన్నాను, ఆనందంగా చేతిలోని సంచి అందుకుంటూ.

ఇంతలో వంటింట్లోంచి వచ్చిన నా భార్య కూడా "రండి మావయ్యా! ఎప్పుడొచ్చారు? మంచి నీళ్లు తాగండి, కాఫీ పెడతా!" అంది ఆప్యాయంగా. అలాంటి ఆప్యాయత చూస్తే ప్రయాణంలో పడిన కష్టం అంతా మర్చిపోతారు, నాన్న.

తను వేణ్ణీళ్లు పెట్టి బాత్ రూమ్‌లోకి తొరిపింది. స్నానం చేసి, టిఫిన్ చేస్తూండగా అడిగాను..... "ఏంటి నాన్నా! మన ఊరి సంగతులు... అన్నయ్యా, వదినా, పిల్లలూ అంతా బాగున్నారా? మీ ఆరోగ్యం ఎలా ఉంది?" అడిగాను. ఈ టైములో నాన్న ఎందుకు వచ్చారా? అని తెలుసుకోవాలని కుతూహలంగా ఉన్నా, అడిగితే బాగోదని ఊరుకున్నాను.

అంతా బావున్నార్రా! మీరంతా ఎలా ఉన్నారు? పిల్లలు బాగా ఆడుకుంటున్నారా? అమ్మాయి కులాసాగా ఉందా? నీ ఉద్యోగం ఎలా ఉంది, డబ్బులు సరిపోతున్నాయా, ఏమైనా ఇబ్బందులు ఉంటే మొహమాట పడకుండా చెప్పు" అన్నారు, నాన్న ప్రేమగా.

"అదే నాన్నా, నేనూ ఆ విషయమే మీతో మాట్లాడదామనుకుంటున్నాను. పిల్లలు ఎదుగుతున్నారు, ఖర్చులు పెరుగుతున్నాయి. ఈ అరా కొరా జీతంతో ఎన్నాళ్లు ఇబ్బంది పడతాం. అందుకే ఏదైనా చిన్న సైడ్ బిజినెస్ మొదలుపెడదామనుకుంటున్నాను. దానికి కొంచెం పెట్టుబడి కావాలి" అంటూ నసిగాను. వడ్డీ వ్యాపారం చేస్తానని చెప్తే నాన్న బాధపడతారని చెప్పలేదు.

"చాలా మంచి ఆలోచన బాబూ. తప్పకుండా చెయ్యి. నేను ఈ విషయంలో ఏ విధంగా సాయపడగలనో చెప్పు. నా పెన్షన్‌మీద లోన్ పెట్టమంటావా? లేదా ఇల్లో, పొలమో తాకట్టు పెట్టమంటావా? ఎంత కావాలి చెప్పు. దాన్నిబట్టి ఏదో ఒకటి చేద్దాం. కానీ బాబూ, వ్యాపారం అంటే చాలా జాగ్రత్తగా ఉండాలి. మన డబ్బులు పోతాయని కాదు కానీ, మనవల్ల ఎవరూ ఇబ్బంది పడకూడదు" అన్నారు, నాన్న ఆప్యాయంగా.

తప్పకుండా నాన్నా. నీకు ఏ విషయం త్వరలో చెప్తాను" తండ్రి డబ్బు సర్దుబాటు చేస్తున్నందుకు ఆనందంగా ఉన్నా, తండ్రికి నచ్చని పని చేస్తున్నందుకు మనసులో బాధగానే ఉంది నాకు.

"బాబూ! అసలు విషయం చెప్పడం మరిచిపోయాను. నేను వచ్చిన పని ఏంటంటే- మీ బాబాయ్ ఈ మధ్య ఫోన్ చేసాడు. నన్ను చూడాలని ఉందని, ఓసారి వచ్చిపొమ్మని. అందుకే వచ్చాను. ఈ రోజు నీకు సెలవే కదా! మధ్యాహ్నం భోంచేసి తర్వాత ఓసారి అలా వెళ్లొద్దాం" అన్నాడు, నాన్న.

"అలాగే నాన్నా! తప్పకుండా. మీరు కాసేపు పడుకోండి. తను వంట చేయగానే లేపుతాను" అంటూ అక్కడినించి లేచా.

మధ్యాహ్నం భోజనాలయ్యాక ఇద్దరం సిటీ బస్‌లో బయలుదేరాం. బస్సులో కూర్చున్నాక నా చిన్నతనం గుర్తొచ్చింది. బాబాయ్ ఒక మెరుపులా ఉండేవాడు. నాన్న మొదట్నుంచి చాలా నిదానం. ఎక్కువ హడావిడి ఉండేది కాదు. అన్నయ్య కూడా నాన్నలాగే ఉండేవాడు కాబట్టి సర్దుకుపోయేవాడు. కానీ నాకు ఆ నిశ్శబ్దం, ఆ బడ్జెట్ ఖర్చులూ, ఆ క్రమశిక్షణ అస్సలు నచ్చేది కాదు. ఎక్కువ సమయం బాబాయ్ వాళ్ల ఇంట్లోనే గడిపేవాడిని. బాబాయ్ కూడా నన్ను వాళ్ల సొంత కొడుకుతో సమానంగా చూసేవాడు. నాన్న టీచర్. బాబాయ్ ప్రభుత్వ ఆఫీసులో ఇంజినీర్. చాలా తెలివైనవాడు. చాలా చురుకుగా ఉండేవాడు. ఉద్యోగంవల్ల వచ్చిన హోదాతో మరింత అందంగా ఉండేవాడు. ఖర్చుకు అస్సలు వెనుకాడేవాడు కాదు. మాకు ఏది కావాలంటే అది కొనిపెట్టేవాడు. అందరూ అతని చేతికి ఎముక లేదనేవారు. మా ఇంటి దగ్గర ఉన్న ఆంక్షలు ఏవీ అక్కడ ఉండేవి కావు. బహుశా అక్కడ ఎక్కువగా పెరగడం వల్లేమో, నాకు చదువు అంత పెద్దగా అబ్బలేదు.

అప్పుడప్పుడూ మా నాన్న, బాబాయ్ వాదించుకోవడం వినబడేది. నాన్న ఏదో కానీ... చెయ్యొద్దు, జాగ్రత్తగా ఉండు అనేవాడు. మా బాబాయ్ మాత్రం నాకు అన్నీ తెలుసు అన్నయ్యా, నేను జాగ్రత్తగానే ఉంటాను అనేవాడు. మాకు ఏమీ అర్థం అయ్యేది కాదు. బాబాయ్ ఉద్యోగం చేస్తూనే కన్స్ట్రక్షన్ బిజినెస్ స్టార్ట్ చేసి బాగా సంపాదించాడు. ఆ తర్వాత బాబాయ్ రిటైర్ అవడం, వాళ్ల బిజినెస్ మా బాబాయ్ కొడుకు చేపట్టడం, తర్వాత వాళ్లు పట్నం వెళ్లిపోవడం వరకూ నాకు తెలుసు.

బాబాయ్ కొడుకు పెళ్లి తర్వాత మరి ఎందుకనో రాకపోకలు తగ్గాయి. ఇదుగో... మళ్లీ బాబాయ్‌ని ఇద్దే చూడ్డం. ఆలోచనలో ఉండగానే మేం దిగవలసిన చోటు వచ్చేసింది.

బస్సు దిగాక చూసాను. అది ఒక విశాలమైన తోటలా ఉంది. ఆ తోటకి ఉన్న పెద్ద గేట్‌పైన "వానప్రస్థం-వృద్ధుల ఆశ్రమం" అని రాసి ఉంది. నాకు ఒక్క క్షణం ఏమీ అర్థం కాలేదు. నాన్నకేసి చూసాను. నా అనుమానం నిజమే అన్నట్టు "అవునురా, బాబాయ్ ఇప్పుడు ఇక్కడే ఉంటున్నాడు" అన్నారు నాన్న, బాధగా. నాకు ఎందుకో ఒక్కసారిగా భయం వేసింది. బాబాయ్ ఇక్కడ ఉండటమేంటి? తమ్ముడు ఈ ఊర్లోనే ఉంటున్నాడుగా! వాళ్లకి డబ్బుకి కూడా ఏమీ లోటు లేదు. ఆలోచిస్తూనే, గేటు దాటి లోపలికి వెళ్లాం.

నిజానికి అది ఒక మామిడి తోట. మధ్యలో రోడ్డు వేసి, అక్కడక్కడా కుటీరాల్లాంటి ఇళ్లు కట్టారు. అందరికీ కలిపి డైనింగ్ హాల్, ఒక మెడిటేషన్ హాల్, ఒక డిస్పెన్సరీ, ఒక చిన్న లైబ్రరీ ఉన్నాయి. మెయింటెన్స్ అంత బాగా లేదు. ఓల్డ్ ఏజ్ హోమ్ కాకుండా ఉంటే ఆ ప్లేస్ చాలా బాగున్నట్టే లెక్క. అక్కడున్న విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి లోపలికి వెళ్లి బాబాయ్ రూమ్‌కి వెళ్లాం. రూమ్ గడె పెట్టి బయట కుర్చీలో కూర్చుని మొక్కలకేసి చూస్తున్నాడు బాబాయ్. అతన్ని అలా చూసేసరికి నాకు ఒక్కసారిగా ఏడుపు తన్నుకువచ్చింది.

జట్టు, గడ్డం మాసిపోయి ఉన్నాయి. బట్టలు నలిగిపోయాయి. రంగు తగ్గిపోయాడు. నవ్వితే సొట్టలు పడే ఆ బుగ్గలు లోపలికి పోయి, దవడ ఎముక పైకి వచ్చింది. కళ్లల్లో తెలివి, వెలుగు స్థానంలో నైరాశ్యం, దైన్యం. మమ్మల్ని చూసి ఒక్కసారిగా చిన్న పిల్లాడిలా అరిచాడు. నేనూ ఉండలేక, బాబాయ్‌ని దగ్గరకి హత్తుకున్నాను. అతని వంటి నుంచి వాసన వస్తోంది.

మధ్యాహ్నం భోజనాలయ్యాక ఇద్దరూ సిటీ బస్‌లో బయలుదేరాం. బస్సులో కూర్చున్నాక నా చిన్నతనం గుర్తొచ్చింది. బాబాయ్ ఒక మెరుపులా ఉండేవాడు. నాన్న మొదట్నుంచి చాలా నిదానం. ఎక్కువ హడావిడి ఉండేది కాదు. అన్నయ్య కూడా నాన్నలాగే ఉండేవాడు కాబట్టి సర్దుకుపోయేవాడు. కానీ నాకు ఆ నిశ్శబ్దం, ఆ బడ్జెట్ ఖర్చులూ, ఆ క్రమశిక్షణ అస్సలు నచ్చేది కాదు. ఎక్కువ సమయం బాబాయ్ వాళ్ల ఇంట్లోనే గడిపేవాడిని. బాబాయ్ కూడా నన్ను వాళ్ల సొంత కొడుకుతో సమానంగా చూసేవాడు.

"ఏంటి బాబాయ్ ఇది!" అన్నాను, కళ్లల్లో నీళ్లు తిరుగుతూ ఉంటే.

బాబాయ్ కూడా ఏడవటం మొదలుపెట్టాడు. కాసేపటికి తేరుకుని "ఎలా ఉన్నావు? కోడలూ, పిల్లలూ బాగున్నారా?" అని అడిగి, మాకు ఆ ఆశ్రమం అంతా చూపించటం మొదలుపెట్టాడు. దాదాపు ఓ ముప్పై మంది ఉన్నారు. అప్పుడే టైం నాలుగయ్యిందేమో, డైనింగ్ హాల్ దగ్గర ఉన్న పెద్ద గంటని కొట్టారు.

అందరూ లేచి డైనింగ్ హాల్‌కి చేరుకున్నారు. మేం కూడా వెళ్లాం. టీ, బిస్కట్లు ఇచ్చే టైమట అది. ఆయా ఒక్కొక్కరి దగ్గరకి వచ్చి ప్లేట్లో బిస్కట్లు విసురుతోంది. టీ గ్లాసు టీ పైకి వలికేంత విసురుగా పెడుతోంది.

కొంత మంది వచ్చి దాన్ని ఇంకో గ్లాసులో చల్లారపెట్టుకుని, కొంత మంది ఊదుకుని, తాగుతున్నారు. దాదాపు అందరి చేతులూ వణుకుతూనే వున్నాయి. ఆడవాళ్లు, మగవాళ్లు కూడా ఉన్నారు అక్కడ, అంతా అరవైలు దాటినవాళ్లే. మేం కూడా టీ తాగి బయటకి వచ్చాక బాబాయ్ చెప్పడం మొదలుపెట్టాడు.

"అప్పట్లో మీ నాన్న దేనికీ చలించకుండా స్థితప్రజ్ఞతతో ఉండేవాడు. నేను అదంతా చాదస్తం అనుకునేవాడిని. ప్రభుత్వ ఉద్యోగంలో పై డబ్బులకి అలవాటుపడ్డ తర్వాత నా జీవితమే మారిపోయింది. పట్టిందల్లా బంగారమైంది. ఆ డబ్బు వ్యాపారంలో పెట్టి బాగా సంపాదించాను. కోట్లకెదిగాను. నేను రిటైర్ అయ్యేనాటికి నా వ్యాపారమంతా నా కొడుక్కి అప్పగించి హాయిగా రెస్ట్ తీసుకుందామనుకున్నాను.

కానీ అప్పుడే మొదలయ్యాయి నా అసలు కష్టాలు. నా కొడుక్కి చిన్నప్పటినుంచి కష్టం అంటే ఏమిటో తెలియకుండా పెంచాను. వాడు ఎదిగేసరికి కోట్ల వ్యాపారం వాడి చేతిలో పెట్టాను. దాంతో వాడికి నా అవసరం లేకుండా పోయింది. వాడు, వాడి భార్య నన్ను నిర్లక్ష్యం చేయడం మొదలు పెట్టారు. మీ పిన్ని పోయాక నా కష్టాలు ఇంకా ఎక్కువయ్యాయి. నా నెల పెన్షన్ వాడికి ఒకరోజు ఖర్చు. దాంతో నన్నో వట్టిపోయిన గేదెను చూసినట్టు చూసేవారు. వాళ్ల విలాసాలకీ, వాళ్ల హోదాకి నేను అడ్డ య్యాను. అంతే. ఇక్కడొచ్చి చేరాను.

నాకు ఇప్పుడు అర్థం అవుతోంది. మీ నాన్న మిమ్మల్ని ఎందుకు అంత కట్టు దిట్టంగా పెంచాడో! నువ్వు, మీ అన్న మంచి వాళ్లే. మీ నాన్నని చాలా బాగా చూసుకుం టారు. కానీ అదంతా మీ గొప్పతనం కాదు. మిమ్మల్ని అలా పెంచిన మీ నాన్న గొప్పత నం. నేను అడ్డదిడ్డంగా పెంచిన డబ్బే నన్ని క్కడికి చేర్చింది. నువ్వు మరోలా అనుకోక పోతే నేనుకూడా హద్దుల్లో ఉండి, నా కొడుక్కి అవసరమైన దానికంటే ఎక్కువ సంపాదించిపెట్టకుండా ఉండి ఉంటే బహుశా వాడు కూడా కనీసం నా పెన్షన్ డబ్బుల కోసమైనా నన్ను బాగా చూసుకునే వాడేమో! మీరు ఆ కారణంగానే మీ నాన్నని చూస్తు న్నారని కాదు నా ఉద్దేశం. పిల్లలు తల్లి దండ్రుల్ని బాగా చూసుకోడానికి అది కూడా ఒక బలమైన కారణమని నాకనిపిస్తే ఆ తప్పు నాదికాదు. నా ఈ దుస్థితిది. అయినా అదేం తప్పు కాదు. బహుశా అందుకేనేమో పల్లెటూళ్లలో ఇలాంటి ఓల్డేజ్ హోమ్‌లు కనబడవు. ఇంకా పెద్దవాళ్ల మాట మీదే అంతా నడుస్తోంది. అప్పట్లో మీ నాన్న ఇదంతా ఊహించి చెప్పాడో లేదో నాకు తెలియదుగానీ, నన్ను అస్తమానూ హెచ్చ రిస్తూ ఉండేవాడు, హద్దులు మీరొద్దని. నేను నవ్వుకొనేవాడిని.నా ఎదుగుదల చూసి ఈర్ష్య పడుతున్నాడేమోనని కూడా అప్పుడప్పుడు అనుమానం వచ్చేది. దాంతో కొన్నాళ్లు మీ నాన్నతో మాట్లాడ్డం కూడా మానేసాను. కానీ ఇప్పుడు మీ నాన్నని తలుచుకోని క్షణం లేదు" అంటూ ఆపి కళ్లు తుడుచుకున్నాడు.

నాకు ఏడుపు ఆగటం లేదు. బాబాయ్‌తో నా సాన్నిహిత్యం అటువంటిది. "పోనీ బాబాయ్, నాతో మా ఇంటికి రా. నా భార్య చాలా మంచిది. నిన్ను బాగా చూసు కుంటుంది" అన్నాను, మనస్ఫూర్తిగా. నిజాయితీగా చెప్పాలంటే, నా అప్పులో, బాబాయ్ పెన్షనో నా చేత ఆ మాట చెప్పించలేదు. అది గుండె లోతుల్లోంచి వచ్చింది.

"లేదురా, ఊళ్లోనే సొంత కొడుకు ఉండి, నేను నీ దగ్గర ఉంటే, అది వాడికి అవ మానం. పైగా నాకు వాడిమీద కోపమేమీ లేదు. తాడిచెట్టు పెంచాలా, మామిడి చెట్టు పెంచాలా అనేది ఎవరికి వాళ్లు తీసుకోవా ల్సిన నిర్ణయం. నేను తాడిచెట్టు పెంచాను. దానికి పెద్దగా సంరక్షణ చెయ్యక్కర్లేదు. మీ నాన్న శ్రద్ధగా మామిడిచెట్టు పెంచాడు. రోజూ గొప్పు తవ్వి, నీళ్లు పోసి పిక్కనించి పెరిగే కొమ్మలు కత్తిరించి, ఒక పద్ధతిలో పెంచాడు. ఇప్పుడు నీడనీ, పండునీ కూడా పంచుకుంటున్నాడు.

"పోనీ ఇక్కడ నీకు ఎలా ఉంది బాబాయ్!" అడిగాను, బాధగా. బాబాయ్ చెప్పటం మొదలుపెట్టాడు.

"గొప్పగా ఉందని చెప్పలేను కానీ ఫరవా లేదు. నిజానికి ఇదేమీ అనాథ శరణాలయం కాదు. ఇక్కడున్న వాళ్లందరిలో ఉన్న ఒక కామన్ క్వాలిఫికేషన్ ఏంటో తెలుసా? డబ్బు. మేమంతా బాగా డబ్బున్నవాళ్లమే. అందుకేగా నెలకి దాదాపు ఇరవై వేలు కట్టగలుగుతున్నాం. అదే మా పాలిట శాపమైంది. ఈ వయసులో ఊరికి దూరంగా విసిరేసిన గదిలో రాత్రిపూట ఒంటరిగా సీలింగ్ ఫ్యాన్‌కేసి చూస్తూ పడుకోవడం అంటే ఎంత కష్టం? ముఖ్యంగా మేం మా తల్లిదండ్రులని ఈ వయసులో చూసిన విధానం, మా పిల్లలకి పంచిన ప్రేమ గుర్తొస్తే, ఆ రాత్రంతా నిద్ర పట్టదు. ఇక్కడ మాకు గుండెనొప్పి వస్తే జెలుసిల్ టాబ్లెట్ వేసుకుంటాం. కీళ్ల నొప్పులకు జండూబామ్ రాసుకుంటాం. కేటరాక్ట్ వస్తే ఐ డ్రాప్స్ వేసుకుంటాం. ఇవేమీ లేకుండా ఆరోగ్యంగా ఉన్నవారు బాగా దూరంగా ఉన్న చావుకై ఎదురుచూస్తూ ఉంటారు. మాలో ఎవరికైనా సీరియస్ అయితే పాపం వీళ్లు ఫోన్ చేసినా ఎవరూ ఎంతకీ రారు. ఇక్కడికి వచ్చే డాక్టర్‌కే చూపించమంటారు. అయినా, అయినవాళ్లు విసిరేస్తే వీళ్లయినా ఆ మాత్రం చూస్తున్నారు కాబట్టి సరిపోయింది. లేదంటే మేం రోడ్డున పడవల్సిందేగా. వీళ్లు ధనాపేక్షతో ఇది నడపటం లేదు. అందుకే ఏమిచ్చినా వీళ్ల రుణం తీర్చుకోలేం. వీళ్లు మాత్రం ఎంత మందినని చూడగలరు. ప్రతిరోజు కనీసం ఒకరు చేరుతున్నారు. ఇక్కడనించి నేరుగా శరీరాన్ని వదిలివెళ్లడమే కానీ, ఒక్కరంటే ఒక్కరు పిల్లల మనసు మారి తిరిగి వాళ్ల ఇంటికి వెళ్లింది లేదు. ఏదో ఇలా గడిచిపోనీ. అప్పుడప్పుడూ వీలు చూసుకుని వస్తూ ఉండు. మీ నాన్నని తీసుకురావటం మర్చిపోకు. వెళ్లిరండి. మళ్లీ చీకటయితే తిరిగి వెళ్లడం ఇబ్బంది" అంటూ ముగించాడు, బాబాయ్.

బాబాయ్ కాళ్లకి నమస్కరించి, నాన్న తెచ్చిన పళ్లు రూమ్‌లో పెట్టి, తిరిగి బయలుదేరాం, బరువెక్కిన గుండెలతో.

ఆ మర్నాడు నాన్న ఊరు వెళ్లిపోతూ– "ఏరా డబ్బులు ఎప్పటిలోగా సర్దుబాటు చేయమంటావు?" అని అడిగాడు.

"వద్దు నాన్నా, ఇప్పట్లో ఏ వ్యాపారమూ చెయ్యను. అవసరమైనప్పుడు అడుగుతాను" అని వంగి నాన్న కాళ్లకి దణ్ణం పెట్టాను.

"అరె ఏమయిందిరా నీకు! లేలే" అంటూ నా రెండు భుజాలు పట్టుకుని పైకి లేపారు నాన్న. ఆ స్పర్శలో ఏదో తెలియని ఒక ధైర్యం, సంతృప్తి. మనిషి గాల్లోకి ఎగిరినా భయపడనిది ఒక్క నాన్న ఎగరేసినప్పుడు మాత్రమే.

నాన్నంటే థెరెసా–మనకిచ్చే భరోసా
నాన్నంటే కవచం–నాన్నే ఓ ప్రవచనం
నాన్న– చరిత్రలో సామాన్యం–నిజానికతనే సియాచిన్ సైన్యం
వానప్రస్థం ముంగిట వాలిన 'నాన్న' మహాప్రస్థానం
మానవత్వం మంటగలిపిన నాగరికత దురహంకారం.

నా ఆలోచనలకి అడ్డు తగులుతూ టి.వి.లో "తండ్రిని మించిన తనయుడు" అని సినిమా వస్తోంది. నాకెందుకో ఆ టైటిల్ నచ్చలేదు. కొడుకు తండ్రిని మించడమేంటి? దేముణ్ణి మించిన పూజారి ఉంటాడా? టి.వి. కట్టేసి నాన్న వెంటే బయలుదేరాను, బస్టాండ్లో దింపటానికి.

(ఎక్కడైతే తల్లిదండ్రులు చరమాంకంలో కొడుకుల దగ్గర హాయిగా ఉంటారో, ఆ కొడుకులకి ఈ కథ ప్రేమతో అంకితం, ఆ కోడళ్లకి పాదాభివందనం) ■

కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతోపాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. **కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:**

ఎడిటర్, ఆదివారం వార్త నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్–80.

ఈ వారం కవిత్వం

స్వప్నం నా ఆకాంక్ష

నా కలలన్నీ నిదురిస్తున్నాయి
ఒంటరిగా నా కన్నులలో, చీకట్లలో
నిరంతరం నిదురిస్తూనే ఉన్నాయి
మినుకుమనే ఆశ తట్టి లేపుతున్నా
మొద్దు నిద్దుర బద్ధకాల్లో ఒత్తిగిలి పడుకున్నాయి
ఇప్పటిదాకా అవి
ఎందరి కన్నులలో పుష్పించాయోగాని
అలసి సొలసి
నా కన్నులలో నిదురిస్తూనే వున్నాయి.
పోనిమ్మని సర్దుకున్నా
ఎప్పటికైనా నా కలల మనసు
కరుగదా అని
ఎదురు
చూస్తున్నా.
మరి నేనేమో
దుఃఖం నేస్తమైన నిర్భాగ్యుడ్ని
అందరికీ తీరని కాంక్షలు స్వప్నాలైతే
నా కన్నులు కాంచని స్వప్నాలే ఘన కాంక్ష.
ఆశలన్నీ అడియాశలై అదృశ్యమైనాయి.
అయినా నీ రూపంకోసం
అపురూపమైన కలనిమ్మని
నా కన్నులను వేడుకొంటున్నా
అయినా కన్నులు కరగలేదు.
కలలను, ఇవ్వనూ లేదు.
అందుకే నాకు స్వప్నం ఓ ఆకాంక్ష.

– కావేరిపాకం రవిశేఖర్

తాను-నేను

కాంపౌండ్వాల్ పక్కగా
తాను తొంగి చూసినపుడే
నేనూ చూశా...
తొలిసారి తనను.
ఇంద్రలోకం నుండి
నిటారుగా
దిగిన అందమది.
ప్రతిరోజూ తన
నవ్వుతోనే
నాకు తొలి
ఉదయం
చూసిన ప్రతిసారీ గుబాళించే
ఆ నవ్వే నన్ను తనకోసం
చూసేలా చేస్తోంది.
తన నిత్య దర్శనంతో
కాలం అపుడే
పుష్కరమై పూసింది
ఇంతలోనే ఎంత మార్పు!
ఇంతే వున్న తాను

మానంతై...
చిరునవ్వుల గుబాళింపులతో
నన్ను ముంచేస్తుంటే
మనసంతా మైమరుపే
అమాంతంగా కాంపౌండ్వాల్
దాటి
నన్ను తాకేంత దగ్గరగా
తాను...
సాయంత్రమైతే
తనను చూడకుండా వుండలేని నేను,
కానీ... కానీ...
ఇందాకే సందేశం
చివరి చూపని....
ఎకాబిగిన వచ్చేలోగా
వైకుంఠ యాత్ర ముగిసినదానికి
ఆనవాళ్లుగా దారంతా పూలు.

కన్నీళ్లాగని నా
కళ్లెదురుగా
దహనమౌతూ తాను
తన ఆనవాళ్లనే స్మరిస్తూ
ఖననమౌతూ నేను...

(పక్కింట్లో పుష్కర కాలంగా పెరిగిన మల్లెచెట్టును కొన్నవాళ్లు కొట్టి కాల్చేశారు... విషాదంగా వుంది)

– కళ్యాణదుర్గం స్వర్ణలత

నడు-నడు

చేతిలో చేయి వేసి
అడుగులో అడుగు వేసి
కలసి మెలసి... నడు-నడు
నలుగురు నడిచే బాటలలో
పదుగురి క్షేమం కోరి
ఏమరుపాటు లేక... నడు-నడు
వేకువఝామున లేచి
ఒంటికి శ్రమ కలిగేలా
వడివడిగా నడు-నడు

నీ ఆరోగ్యం కోసం... నువ్వు- నడు
బతుకుబాటలో... జాగరూకతో నడు

కష్టాలనెడి కంటకాలు,
పొంచి గుచ్చుకుంటాయి
అవకాశం అందిపుచ్చుకుని
అలుపు-సొలుపు లేక నువ్వు-నడు
లక్ష్యసిద్ధి కోసం... అనుక్షణం నడు
ఆగక చేరాలిక... నీ గమ్యం
కాలానుగుణంగా... నువ్వు మారి
కాలగమనంతో కలసి నడు
మంచి నడతతో... కడదాకా నడు
నడు-నడు.. నడచి నువ్వు....
బాగుపడు!

– డా॥ కురుమేటి కిషోర్కుమార్

రచనలకు ఆహ్వానం

రచయితలనుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతోపాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి. **రచనలు పంపించాల్సిన చిరునామా:**

ఎడిటర్, ఆదివారం వార్త నం.396, లోయర్ ట్యాంక్బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80

సింగిల్ పేజీ కథ

కుక్క కాదు 'బుల్లెట్'

– మల్లాది వరలక్ష్మి

వదిన నుండి ఫోన్... "మూడు ఇళ్లు సిద్ధంగా ఉన్నాయి. నువ్వు వచ్చి చూసుకోమని". ఆ మర్నాడు అన్నయ్య ఇంటికి వెళ్లాను. వదిన, నేను ఇళ్లు చూడ్డానికి బయలు దేరాం. మొదటిది గాలి, వెలుతురు తక్కువ. రెండోది అద్దె ఎక్కువ అనిపించాయి. మూడోది బాగుంది. కింద ఇల్లు. మా పైన ఓనర్స్ ఉంటారు. ఇంటివాళ్ల బెల్ కొట్టాం. లావుగా, తెల్లగా, మేక్సీ వేసుకొని, ఇంటి ఆవిడ తలుపు తీసింది. సంగతి చెప్పాం. అందర్ ఆవో అంటూ ఇంట్లోకి దారి ఇచ్చింది.వాళ్లు హిందీవాళ్లు.సగం హిందీ సగం తెలుగు. నేను వదిన సోఫాలో కూర్చుని, ఎడ్వాన్స్ ఇస్తూవుంటే గుర్రంలాంటి కుక్క మొరుగుతూ వచ్చి సోఫాలో మా మధ్యన కూర్చుంది. మేం అది రిపడి లేచాం. బైఠో బుల్లెట్.. అంటూ దాన్ని గోముగా పిలుస్తూ బెడ్ రూమ్‌లో పెట్టింది. అమ్మయ్య అనుకొని ఇవతల పడ్డాం.

* * *

సామానులతో ప్రవేశం, సర్దుకోవటం అయ్యింది. పిల్లల్ని స్కూలుకి పంపాను. ఆయన ఆఫీస్‌కి వెళ్లారు. పిల్లలు వచ్చే వేళ అవటంతో నేను గేటు దగ్గరకి వెళ్దాం అని తలుపు తీసా. కారిడార్‌లో పచార్లు చేస్తూ బుల్లెట్. 'ఇదేంటిరా బాబూ! పిల్లలు వచ్చే టైమ్ అయ్యింది' అనుకొని కిటికీలోంచి దాన్నే చూస్తూ ఉన్నా, రెండు మూడు సార్లు చెక్కర్లు కొట్టి మెట్లెక్కింది. అమ్మయ్య అనుకొన్నా.

* * *

పిల్లలు బట్టలు మార్చుకొని, హాల్లో సోఫాలో కూర్చుని హోమ్ వర్క్ చేసుకొంటున్నారు. ఎవరో బరబరా గోళ్లతో తలుపు గీరుతున్నారు, నా కొడుకు వెళ్లి తలుపు తీసాడు. అమాంతం బుల్లెట్ ఇంట్లోకి వచ్చి సోఫా ఎక్కి కూర్చుంది. పిల్లలు కెవ్వుమని బెడ్ రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకొన్నారు. నేను భయపడుతూ వంటింట్లోంచే దాన్ని గమ నిస్తున్నా. అది నాలుక బయట పెట్టి, ఒగురుస్తూ, ఇటూ అటూ చూస్తోంది. నాకు ఏం చెయ్యాలో తోచలేదు. 'ఇదేంటి! వాళ్ల ఇల్లా ఎంచక్కా కూర్చుంది' అనుకొన్నా. ఇంతలో ఆయన వచ్చారు. ఆయన్ని చూసి అరవటం మొదలుపెట్టింది. ఆయన ముందు కంగారుపడ్డా వెంటనే బయటికి వెళ్లి 'కమాన్... కమాన్' అంటూ పిల్చారు. అది ఏమనుకొందో ఏమో! సోఫా దిగి కారిడార్‌లోకి వెళ్లింది. ఈయన లోప లికి వచ్చి వెంటనే తలుపు వేసారు. అది పైకి వెళ్లి, బాల్కనీలోంచి వచ్చిపోయేవాళ్లని చూస్తూ మొరగటం మొదలుపెట్టింది.

* * *

రోజూ ఇంచుమించు ఇదే గొడవ. వాళ్లు దాన్ని మెట్లకింద కెనల్ (కుక్క గది) ఉంది. దాంట్లో కట్టరు. యధేచ్ఛగా కిందా, పైన తిరుగు తుంది. పిల్లలు భయపడుతున్నారు. మా పక్కనే ఇంకో పోర్షన్ అద్దెకు ఇచ్చారు. వాళ్ల ఇంటికి వెళ్లాను. వాళ్లు ఈ మధ్యనే వచ్చారట. ఆవిడని ఈ కుక్కగోల గురించి అడిగాను. ఆవిడ అదే చెప్పింది- వాళ్ల ఇంట్లోకి వచ్చేస్తుంది అని. తలుపు తీయకపోతే తీసేవరకు మొరుగుతుందని. ఈ కుక్క గోలవల్ల ఈ ఇంట్లో ఎవరు ఎక్కువ కాలం అద్దెకు ఉండరని.

* * *

కాలింగ్ బెల్ మోగుతూ ఉంటే, మెల్లగా తలుపు తీసా. ఇంటి ఓనర్ నిక్కర్, టీ షర్ట్ వేసుకొని కుక్కని వెంటబెట్టుకొని లోపలికి వచ్చాడు. అరవై సంవత్సరాలపైనే ఉంటాయి. కుక్కతో సహా రావటంతో నేను తడబడ్డా. ఆయన చాలా గంభీరంగా 'బుల్లెట్ నీచే బైఠో' అంటూ రెండు మూడు సార్లు చెప్పాక కూర్చుంది. ఆయన సోఫాలో కూర్చుని కొంచెం తెలుగు, హిందీలో ..అచ్ఛా హై ఘర్! అంటూ అడిగారు.

నేను వెంటనే "అన్నీ బాగున్నాయి, కానీ మీ డాగ్ లోపలికి వచ్చే స్తోంది, పిల్లలు, నేను భయపడుతున్నాం" అన్నా. ఆయన వెంటనే సీరియస్‌గా కుక్క కాదు 'బుల్లెట్' అన్నారు. నేను ఏం అనలేదు. ఆయ నకి ఆ కుక్క అంటే ఎంత ఇష్టమో, దాన్ని ఎవరు ఏమన్నా నచ్చదు అని నాకు అర్థం అయ్యింది.

* * *

వాళ్ల చిన్నమ్మాయి వచ్చి మా ఇంట్లో కూర్చుని కబుర్లు చెప్పటం మొదలుపెట్టింది. వాళ్లు ముగ్గురు ఆడపిల్లలు, ఆఖరున అబ్బాయి. పెద్దమ్మాయికి పెళ్లి అయ్యిందని, రెండో అమ్మాయికి చూస్తున్నారని, తను ఎం.బి.ఏ. చేస్తున్నానని చెప్పింది. మెల్లగా బుల్లెట్ గురించి ఎత్తాను. తను వెంటనే రియాక్ట్ అయ్యి ఆ బుల్లెట్ అంటే వాళ్ల డాడికి ఎంత ఇష్టమో చెబుతూ- దాన్ని ఏసి గదిలోనే పడుకోబెడతారు అని, అలాగే వేడి వేడి పుల్కాలు పెడితేనే తింటుంది అని, పని ధ్యాసలో పడి ఇంట్లోవాళ్లు దాన్ని సరిగ్గా చూడరేమో అనే అనుమానంతో ఈ మధ్యన బిజినెస్ సరిగ్గా చెయ్యటం లేదని చెప్పింది.

* * *

బుల్లెట్ ఆగడాలు రోజురోజుకి ఎక్కువైపోతున్నాయి. వంటింట్లో తిరు గుతుంది. పైగా వంట వాసనలు పసిగట్టి ఏదో ఒకటి పెట్టేవరకు వెళ్లదు. సోఫా ఎక్కితే ఇంక దిగదు. పోనీ ఫ్రెండ్లీగా ఉంటుందా అదీ లేదు. దాన్ని గూర్చి చెబుదామని ఇంటి ఓనర్ కారిడార్‌లో కనిపిస్తే ఆయనే మొదలుపెడతాడు.. వెరీ ఫ్రెండ్లీ డాగ్ అని, అది ఏమేమి చేస్తుందో, దాన్ని మెచ్చుకుంటూ సోది చెబుతుంటాడు.

ఈ సంగతులు అన్నయ్యతో చెప్పా. అన్నయ్య కూల్‌గా నవ్వుతూ 'నాకొదిలెయ్యి నేను చూసుకొంటా' అన్నాడు. 'ఏం చేస్తావు అన్నయ్యా' అన్నా. 'అన్నీ వివరంగా చెబుతాగా' అన్నాడు.

* * *

అన్నయ్య, అన్నయ్య ఫ్రెండ్ అనుకొన్నట్లుగా ఓనర్స్ ఇంటికి వచ్చారు. నేను, ఓనర్‌ని, ఆయన భార్యని పరిచయం చేసా. వీరే మాకు ఇంటివాస్తు, ధనయోగం అన్నీ సంగతులు చెబుతారు అని. అన్నయ్య వాళ్ల ఫ్రెండ్‌ని పరిచయం చేసాడు. అన్నయ్య ఫ్రెండ్‌కి వీటితో పరిచయం ఉంది. మీ అమ్మాయి పెళ్లి ఎప్పుడు అవుతుందో కూడా చెబుతారు అని చెప్పా. ఈ లోపల 'బుల్లెట్' వచ్చి అన్నయ్య పక్కన కూర్చుంది. అన్నయ్య కూడా దాని ఆకారానికి భయపడ్డాడు. ఓనర్ ఏమనుకొన్నాడో ఏమో దాన్ని కొంచెం దూరంలో కట్టేసాడు. అలా కట్టేసినందుకు గొడవ మొదలుపెట్టింది.

* * *

అన్నయ్య ఫ్రెండ్ ఇల్లు చూసాడు. వాళ్లమ్మాయి జాతకం చూసాడు. కానీ మీ ధనయోగం తగ్గటానికి కారణం అంటూ ఆపేసాడు."చెప్పండి! ఫరవాలేదు" అన్నారు ఓనర్. మీ డాగ్.. బుల్లెట్ వచ్చినప్పటి నుండి మీకు ధనయోగం తగ్గింది. అవునా?" అన్నాడు. వెంటనే ఓనర్ భార్య "అవును" అంది. "దానికి కారణం మీరే" అన్నాడు.

నేను భయ పడుతూ కూర్చున్నా. ఏం వినాల్సి వస్తుందో అని.

ఓనర్ "ఫరవాలేదు చెప్పండి" అన్నాడు.

"ఏం లేదు. వంటింట్లో ఏముంటాయి? పూజగదిలో ఏముంటాయి? అన్నాడు..." ఓనర్ వెంటనే "వంటసామానులు, పూజగదిలో పూజసా మాను" అన్నాడు. "మనం ఎక్కడ పడుకుంటాం?" అడిగాడు. "బెడ్ రూమ్‌లో అన్నాడు.

ఈ ప్రశ్నలు ఏంటా అన్నట్లు ముఖం పెట్టాడు ఓనర్. ఆయన "ఈ బుల్లెట్‌కి సరైన ప్లేస్ ఉండి కూడా మీరు ఇవ్వటం లేదు. అది ప్రశాం తంగా దాని కెనెల్‌లో వుంటే దానివల్ల మీకు, మీ ఇంటికి మేలు జరు గుతుంది. అది ఇంటికి వచ్చిన 'కాపలా'. ఇంట్లో వుండకూడదు. కాశీ క్షేత్రానికి కాపలా 'కాలభైరవుడు'. అంటే దేవుడు. మీ బుల్లెట్ కూడా అంతే. మీరు కొన్నాళ్లు ఇలా చేసి చూడండి. టైమ్ ప్రకారం దాన్ని బయట షికారు తిప్పి, ఆహారం పెట్టి కెనెల్‌లో ఉంచితే- ఇంట్లో శుభకార్యాలు, ధనయోగం కలుగుతుంది" అంటూ ముగించాడు.

* * *

నాలుగు రోజులుగా దాన్ని దాని కెనెల్‌లో ఉంచుతున్నారు. టైమ్ ప్రకారం ఫుడ్, బయట తిప్పటం అవసరాలకి. ఆ ఓనర్ అది మొరు గుతూ ఉంటే ఆయన కిందకి పైకి తిరుగుతూ దాన్ని బుజ్జగిస్తూ వుంటే ఆయన ఆయాసపడుతూ వుంటే జాలి, నవ్వు వస్తున్నాయి. మొత్తానికి పది రోజుల తర్వాత బుల్లెట్ 'కెనెల్'లో ఉండటానికి అలవాటు పడింది. ■

బాహ్యావినత ద్వార దోషం అంటే ఏమిటి?

వాస్తువార్త

వాస్తువిద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్- 3
సెల్స్: 9885446501/ 9885449458

- పి.కె - విశాఖపట్నం

ప్రశ్న: బాహ్యావినత ద్వార దోషమంటే?

గృహానికి ఎంత మందంగల గోడలు కట్టినప్పటికీ, ఆ గోడలో అమర్చే ద్వారం, గోడకు మధ్య భాగంలోగానీ, వెనుక అంచుకుగానీ రాకూడదు. గోడ వెలుపలి అంచుకు సమంగా ప్రతిష్ఠింపబడాలి. 'వదంబం' వేసి 90^0 నిటారుగా వున్నట్లుగా తప్పకుండా నిర్ధారణ చేసుకోవలసిందే. ఒకవేళ తలుపు నిటారుగా వుండక వెలుపలి వైపుకి వంగి వున్నట్లయితే 'బాహ్యావినత ద్వార దోషం' సంభవిస్తుంది. ఇలాంటి దోషంగల గృహంలో నివసించే యజమాని లేదా ఆ కుటుంబ సభ్యులు ఆ గృహంనుండి చాలా వరకు బయట గృహాల్లో నివసిస్తూ ఉంటారు. కానీ ఈ ఇంటికి వస్తూ, పోతూ వుంటారు. ఈ విధమయిన వాస్తుదోషం మిగతా వాస్తు దోషాలతో కూడుకుని వున్నప్పుడు యజమానిగానీ, ఆ కుటుంబ సభ్యులుగానీ, వక్ర మార్గంలో (వ్యసనాలు మొదలయిన) ఆ ఇంటికి దూరంగా నివసిస్తూ, ధనాన్ని వ్యర్థం చేస్తూ ఇతర కుటుంబ సభ్యుల నుండి దూరం పెంచుకుంటూ అప్పుడప్పుడు వస్తూ, పోతూ వుంటారు. ఈ దోషం వున్నప్పటికీ ఆ ఇంటికి మిగతా వాస్తు విశేషాలు కలిస్తే ఆ ఇంటి యజమాని గానీ, కుటుంబ సభ్యులుగానీ సక్రమ రీతిలో (ఉద్యోగ, వ్యాపారరీత్యా) ఇంటికి దూరంగా నివసించవలసి వచ్చినా, వారు ధనాన్ని, సంపదను కూడబెడుతూ తమ కుటుంబానికి సహాయపడుతూ కుటుంబ సభ్యుల మన్ననకు పాత్రులయ్యే అవకాశం ఉంటుంది. స్వగృహానికి వస్తూ, పోతూ వుంటారు. అలాగని ఉద్దేశపూర్వకంగా ద్వార బంధాన్ని ఇలాంటి దోషంతో ప్రతిష్ఠించుకోకూడదు. గృహస్థుడయినా వ్యసనాలతో ఇంటికి దూరంగా ప్రవాసముంటున్నప్పుడు ఇలాంటి దోషం వున్నదేమోనని ప్రధాన ద్వార బంధాన్ని ఒకసారి పరిక్షించుకొని, దోషముంటే సవరిం చుకోవటం వలన సత్ఫలితాలను ఆశించవచ్చు.

వీధిపోటు మంచిదేనా?

-నాగేశ్వరరావు - పశ్చిమ గోదావరి జిల్లా

ప్రశ్న: ఈ ఇంటిని కొనాలనుకుంటున్నాను. ప్లాను పంపిస్తున్నాను. ఈ ఇల్లు వాస్తు ప్రకారం వున్నదా? లేదా? ఈ ఇంటికి నైరుతి వీధిపోటు వున్నది. ఈ వీధిపోటు మంచిది కాదా? వీధిపోటు వలన ఈ ఇంటికి ఎటు వంటి ఫలితాలుంటాయి?

జవాబు: పశ్చిమ నైరుతి వీధిపోటు సాధారణంగా ఆరోగ్యపరమయిన చెడు ఫలితాలనిస్తుంది. అందుకని ఇలాంటి ఇళ్లను కొనక పోవటమే మంచిది. ఒకవేళ ఇలాంటి ఇళ్లల్లో ఉండటం తప్పనిసరయినప్పుడు ఈ వీధి పోట్ల దోషం సాంద్రతను తగ్గించే ప్రత్యామ్నాయ పద్ధతులున్నాయి. వాటిని ఉపయోగించుకొని నివసించవచ్చు.

ఎండిన వేప చెట్టు ఉండవచ్చా?

- ఎస్.ఎమ్ - తూ.గో.జిల్లా

ప్రశ్న: మా గృహావరణలో ఒక వేపచెట్టు వున్నది. కాలక్రమంలో అది ఎండిపోయింది. ప్రస్తుతం మోడుగా మిగిలింది. ఆ చెట్టును తీసేయాలా? అలాగే వుంచేయాలా?

జవాబు: కాలిన, ఎండిపోయిన, కాకులు గూళ్లు పెట్టిన చెట్లు, గాలికి పడిపోయిన చెట్లు ఇంటి ఆవరణలో వుండకూడదు. అలాంటి చెట్లు వుంటే 'వృక్షవేధ' దోషం కలుగుతుంది. వృక్ష వేధ దోషంవల్ల కలహం, భయం, శత్రుభయం, ధనహాని, సుఖం లేకపోవటం మొదలయిన దుష్ఫలితాలు ఏర్పడతాయి. అందువల్ల ఆ చెట్లను తప్పనిసరిగా నిర్మూలించాలి. ఒకసారి మీరు వ్యక్తిగతంగా సంప్రదిస్తే శాంతిపూజా విధానం వివరిస్తాను. ఆ పద్ధతిననుసరించి ఎండిన చెట్లను ఒకే రోజులో వేర్లతో సహా నిర్మూలించి, నేలను చదును చేయాలి. ఆ చెట్ల అవశేషాలను ఇంటి ఆవరణలో ఉంచకుండా వేరే ప్రదేశానికి తరలించాలి. వేప, రాగి, జువ్వి, మారేడు, కొబ్బరి మొ॥ వృక్షాల విషయాల్లో జాగ్రత్త అవసరం.

ఆర్థిక ఇబ్బందులకు కారణం!?

- ఎస్.జి - ఏలూరు

ప్రశ్న: 4 సంవత్సరాల క్రితం మా ఇంటికి తూర్పున మా ప్రహరీగోడను ఆనుకొని మా ఇంటికంటే 3 ఫీట్ల ఎత్తున గృహ నిర్మాణం జరిగింది. అప్పటినుండి నాకు కొన్ని ఆర్థిక ఇబ్బందులు ఏర్పడి, మెల్ల మెల్లగా తీవ్రమయ్యాయి. మాకు ప్రహరీ గోడ వున్నది. దీని వల్ల నాకు ఇలాంటి కష్టాలు కలుగుతున్నాయా?

జవాబు: తూర్పున పొరుగువారి గృహావరణ నేలమట్టం, మీ గృహావరణ నేలమట్టంకంటే హెచ్చుగా వుండటం వాస్తుదోషమే అవుతుంది. దీనినే 'గృహకర్తరి' దోషమంటారు. తూర్పు ప్రహరీగోడ నుండి కనీసం రెండడుగుల ఖాళీ స్థలం వదిలి మీరు మరో ప్రహరీగోడను నిర్మించుకోవటంవల్ల మీకు చాలావరకు ఉపశమనం కలుగుతుంది. అది వీలవుతుందో లేదో ప్రయత్నించి చూడండి.

మార్పులు చెయ్యాలా?

- నాగేశ్వరరావు - తుని

ప్రశ్న: మా ఇల్లు 8 సంవత్సరాల క్రితం కట్టాం. ప్రస్తుతం ఇందులో ఏమయినా వాస్తు దోషం వున్నదా? ఇన్ని రోజులు కోర్టు గొడవలు జరిగాయి. ఇప్పుడు కొత్తగా సంపు నిర్మించాం. ఇంట్లో గొడవలు, ఆర్థిక ఇబ్బందులు లేకుండా మనశ్శాంతిగా వుండేందుకు ఇంకేమయినా చెయ్యాలా? తెలుపగలరు.

జవాబు: మీరు కొత్తగా తీసిన నీళ్ల సంపు ప్రధాన ద్వారానికి ఎదురుగా వున్నది. అలా వుండకూడదు. జరగవలసిన వ్యవహారాలకు అనేక అవరోధాలు కలిగే అవకాశం వుంటుంది. కొత్తగా నిర్మించిన సంపును పూర్తిగా పూడ్చేసి తూర్పున ఖాళీ స్థలంలో ప్రహరీగోడకు దగ్గరగా కొత్త సంపును తీయండి. ఈ ఒక్క మార్పు వల్ల మీకు చాలా వరకు మంచి ఫలితాలు గోచరిస్తాయి. ■

వాస్తువిద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: **సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ**, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు: ------------------------------------
పుట్టినతేదీ:------------------ ఊరు: -------------
జన్మనక్షత్రం:---------తల్లిపేరు:--------------------
చిరునామా: ---------------------------------------
------------------ ఫోన్: -----------------------

ఆమెను పెళ్లి చేసుకోవాలా, వద్దా?

పర్సనల్ పాయింట్

చల్లా సుబ్రహ్మణ్యం
1 సి-ఐక్యూ టవర్స్, 3-4-540,
నారాయణగూడ, హైదరాబాద్-27
మొబైల్: 9866362224/ 9553662224
challascounsel@gmail.com
www.challascounsel.com

టి.కె.ఆర్ - ప్రకాశం జిల్లా

ప్రశ్న: నా వయసు 28. ఈ మధ్యనే పెళ్లి సెటిలైంది. ఏప్రిల్ నెలలో పెళ్లి అనుకుంటున్నాం. నాకు కాబోయే అమ్మాయికి అంతకుముందే సీరియస్‌గా బాయ్ ఫ్రెండ్ వున్నాడనీ, అది గాఢమైన ప్రేమేననీ తెలిసింది. వాళ్ల పెద్దవాళ్లను మా వాళ్లు గట్టిగా నిలదీస్తే- "నిజమే! చదువుకునేటప్పుడు మద్రాస్‌లో ఎవరితోనో పరిచయమనీ, అదేమంత సీరియస్ కాదనీ, అతన్ని మర్చిపోయిందనీ చెప్పారు. అమ్మాయితోనూ అదే మాట చెప్పించారు. ముందు ఎందుకు చెప్పలేదు... అని అడిగితే భయం వేసి చెప్పలేదు... అంది. ఇప్పుడు నేనేం చేయాలి? వచ్చే నెలలో ముహూర్తానికి పెళ్లి చేసుకోవాలా? ఇప్పుడు మానుకుంటే పరువు సమస్య అంటున్నారు, అమ్మా-నాన్న. నాకేమో కాన్సిల్ చేసుకోవాలని వుంది. సలహా చెప్తారా? వచ్చి కలుస్తాను.

జవాబు: క్యాన్సిల్ కాదు కానీ ప్రస్తుతానికి పెళ్లిని కొంచెం వాయిదా వేసుకుని రా, మాట్లాడుకుందాం. పెద్దవాళ్ల పరువు సమస్య, అలాగే నీ వేదననీ అర్థం చేసుకోగలను. అమ్మాయి కూడా వుండేది హైదరాబాద్ అన్నావు కనుక ఆమె గురించి, ఆమె ఆలోచనల గురించి తెలుసుకుని నిర్ణయం తీసుకోవచ్చు. ఆమె ఆలోచనల్ని స్పష్టంగా తెలుసుకోకుండా పెళ్లి చేసుకోవడం కరెక్ట్ కాదు.

జ్ఞాపకశక్తి టెక్నిక్స్‌కు ఎన్ని రోజులు పడుతుంది?

బి.బి.ఎస్ - కరీంనగర్

ప్రశ్న: మా వాడు 9వ క్లాస్ చదువుతున్నాడు. పరీక్షల్లోపు బాబుకు మీ 'మనోప్రాణయోగ' ద్వారా జ్ఞాపకశక్తి సూత్రాలు నేర్పించాలనుకుంటున్నాం. వాటికి మూడు రోజులు సరిపోతుందని మీరు ఇంతకుముందు చెప్పారు. అలాగే పరీక్షల్ని ఎదుర్కొనే సూత్రాల గురించి కూడా మీరు చాలా సార్లు రాశారు. అయితే ఇవి పరీక్షలకి ఎన్ని రోజుల ముందు నేర్చుకోవాలి?

జవాబు: జ్ఞాపకశక్తి సూత్రాలు నేర్పించడానికి మూడు, నాలుగు రోజుల సమయం సరిపోతుంది. అయితే ఈ సూత్రాలు పరీక్షలకి నాలుగు రోజుల ముందు నేర్చుకుని వెళితే ఏదో 'అద్భుతాలు' జరిగిపోతాయి అనుకోవద్దు. ఇదేదో 'మంత్రం' కాదు. నేను మాంత్రికుడ్ని కాదు. ఈ టెక్నిక్స్‌ని నేర్చుకుని ప్రాక్టీస్ చేసి తద్వారా మెదడులోని జ్ఞాపకశక్తి కేంద్రాల్ని నిద్ర లేపి చురుకుగా పని చేసేలా తయారు చేయవచ్చని భారతీయ యోగ శాస్త్రం తెలియజేస్తుంది. పరీక్షలకి కనీసం ఇంకా నెల రోజులు టైం ఉంది. అనుకుంటే బాబుని తీసుకుని రండి. నేర్పిద్దాం. లేదంటే వేసవి సెలవుల్లో ప్లాన్ చేసుకోండి. పరీక్షల్ని ఎదుర్కొనే సూత్రాలు మాత్రం ఎగ్జామ్స్‌కి వారం పది రోజులముందు నేర్పిస్తే మంచిది.

తనతో ఎవరూ మాట్లాడరట!?

ఆర్.వి - హైదరాబాద్

ప్రశ్న: నా వయసు 34. మా పాప నాలుగవ క్లాస్ చదువుతోంది. వాళ్ల నాన్నకన్నా అమ్మాయి నాతోనే చనువుగా వుంటుంది. పాపకు స్నేహితుల విషయంలో మొదట్నించీ కష్టాలే. పక్కనున్న స్నేహితులెవరూ తనను- వాళ్లతో కలుపుకోరని, ఆటల్లోనూ ఏదో మొక్కుబడిగా పాల్గొనడమే తప్ప తనని టీచర్లు కూడా ఎక్కువ ప్రోత్సహించరనీ, స్కూల్‌కి వెళ్లాలనిపించదని బాధ పడుతుండేది. స్కూల్ వాతావరణం సరిపడడం లేదని ఈ సంవత్సరం వేరే స్కూల్లో చేర్చాం. రెగ్యులర్‌గా పేరెంట్-టీచర్ మీటింగ్స్‌కి వెళ్లి అమ్మాయి గురించి తెలుసుకుంటూ వుంటాను. టీచర్స్ చెప్పినదాన్నిబట్టి మా పాపకి కొంచెం కోపం ఎక్కువనీ.. ఆ కోపంవల్ల స్నేహితులతో ఎక్కువగా కలవదనీ కిటికీ పక్క సీట్లో కూర్చుని శూన్యంలోకి చూస్తూ ఉండిపోతుందని అర్థమైంది. పాపకి కొంచెం కోపం ఎక్కువే. నాకు మా వారికి మరీ ఎక్కువ లేదు గానీ కొంచెం వుంది. తన క్లాస్‌మేట్స్‌కి ఏవేవో గిఫ్టులు ఇచ్చి మరీ స్నేహాన్ని పెంచుకోవాలనుకుంది మా పాప. అయినా ఇలా ఎందుకు జరుగుతుందో అర్థం కావడం లేదు. తనతో ఎవరూ మాట్లాడడం లేదని రోజూ ఇంటికొచ్చి ఏడుస్తుంటే తల్లిగా నేను చూడలేకపోతున్నాను. ఏం చేయమంటారు?

జవాబు: మీ కోపం కొంచెం... మీ వారిది కొంచెం కలగలసి అమ్మాయికి కోపంపాళ్లు బాగానే వచ్చినట్టుంది. అలిగే తత్వం, అసూయ కూడా అమ్మాయిలో పుష్కలంగానే ఉన్నాయని అనుమానంగా ఉంది. మీ అమ్మాయి ఇచ్చే గిఫ్టులు వాళ్ల క్లాస్‌మేట్స్ క్షణాల్లో మర్చిపోతారు.

